**విలేఖరులు కావలెను**

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి: 03 సంచిక : 105 ఆదివారం, జూలై 21, 2024 RNI NO: APTEL16151 పేజీలు : 8 వెల: రూ.2


# ఏటా జూన్‌లో నోటిఫికేషన్లు

## డిసెంబరులోపు ఉద్యోగాల భర్తీ

- జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం
- లోపాల్లేకుండా పరీక్షలు, నియామకాలు చేపడతాం
- రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి
- అభ్యర్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది: రేవంత్
- 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' ప్రారంభించిన సీఎం
- సివిల్స్ మెయిన్స్ రాసే అభ్యర్థులకు రూ.లక్ష సహాయం
- నేడు ఢిల్లీకి రేవంత్.. వరంగల్ సభకు రాహుల్‌కు ఆహ్వానం



హైదరాబాద్, జూలై 20 : రాష్ట్రంలో ప్రతి ఏటా జూన్ నెలలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి, డిసెంబరులోపు నియామక ప్రక్రియలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌పై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కష్టపడితే తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల వెన్నుతట్టి అండగా నిలుస్తుందనే సంకేతాలివ్వడానికి, నిరుద్యోగుల్లో నమ్మకం, విశ్వాసం కల్పించడానికే 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎసఆర్)' కింద సింగరేణి సంస్థ సమకూర్చిన నిధులతో చేపట్టిన ఈ పథకాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ పథకం కింద.. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై.. మెయిన్స్ రాసే అభ్యర్థులకు ఈ పథకం కింద రూ.లక్ష సహాయాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా సీఎ రేవంత్ మాట్లాడుతూ.. సహాయం అందుకునే అభ్యర్థులంతా కచ్చితంగా సివిల్స్‌కు ఎంపికై తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశం పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది అఖిల భారత సర్వీసులకు ఎంపిక కావాలన్నారు. వెనుకబడిన రాష్ట్రాలుగా పేరున్న బిహార్, రాజస్థాన్ నుంచి అత్యధిక మంది ఐఏఎసలు ఎంపికవుతారని, ఆ రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొని రాణించాలని పిలుపునిచ్చారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, బ్యాంకింగ్ నియామకాల్లో బిహార్ రాష్ట్ర అభ్యర్థుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందన్నారు. "కేంద్ర సర్వీసుల్లో ఉంటే రాష్ట్రానికి మేలు చేసే అవకాశం ఉంటుంది. మీ గెలుపులో మీ భవిష్యత్తే కాకుండా.. రాష్ట్ర భవిష్యత్తు కూడా ముడిపడి ఉంది" అని సీఎం అన్నారు.

### ఉద్యోగాల కోసమే తెలంగాణ ఉద్యమం..

నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం జరిగిందని, తెలంగాణ పోరాటానికి పర్యాయపదం నిరుద్యోగ సమస్య అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకి చెందిన వేలాది మంది విద్యార్థుల పోరాటంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందన్నారు. అందుకే తమ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి రాగానే.. ప్రమాణం చేసిన చోటునుంచే 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామన్నారు. గత పదేళ్లలో.. ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రకారం నియామకాలు జరగలేదని, యుక్త వయసులో నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందని, పరీక్షలు రాసి, ఫలితాలు వచ్చేలోపే ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లకు

(మిగతా 2వ పేజీలో)



# అన్ని గేట్లు ఎత్తి పెట్టాల్సిందే

## మేడిగడ్డ బరాజ్ సహా మిగతా 2 బరాజ్‌ల గేట్లెత్తాలి

- వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదిలేయండి
- మంత్రి ఉత్తమ్, అధికారుల స్థాయి భేటీలో స్పష్టం చేసిన ఎన్‌డీఎస్‌ఏ
- ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే నడుచుకుంటామన్న ఉత్తమ్

న్యూఢిల్లీ: కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్ సహా మిగతా రెండు బరాజ్‌ల గేట్లను పూర్తిగా ఎత్తి పెట్టాల్సిందేనని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. ప్రస్తుతం బరాజ్‌ల్లోకి వస్తున్న వరదను వచ్చింది వచ్చినట్లుగా దిగువకు వదిలేయాలని సూచిం చింది. సోమవారం మరోమారు ఇంజనీర్ల స్థాయి లో చర్చించి, తదుపరి కార్యాచరణపై చర్చిద్దామని తెలిపింది. మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ సహా ఇతర అంశాలపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం


(మిగతా 2వ పేజీలో)

# నిరుద్యోగులకు కాంగ్రెస్ దగా..

- 2 లక్షల ప్రభుత్వ కొలువులు..
- గ్యారెంటీలు ప్రజలకు గుదిబండలు
- రాష్ట్రంలో మంత్రుల దోపిడీ: కిషన్‌రెడ్డి




2లో



## జూరాల 17గేట్లు ఎత్తివేత

- ఈ ఏడాది ఇదే తొలి..
- శ్రీశైలానికి 48 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నారాయణపూర్, తుంగభద్ర జలాశయాలకు లక్ష క్యూసెక్కులు
- మేడిగడ్డకు కొనసాగుతున్న వరద.. 3.73 లక్షల క్యూసెక్కులు

2లో



2లో

## రేపటి నుంచి పార్లమెంటు

- తొలిరోజు ఆర్థిక సర్వే..
- ఎల్లుండి కేంద్ర బడ్జెట్
- ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్


# ప్రతి రూపాయి రాబట్టండి

## కేంద్రం పథకాలకు వచ్చే నిధులన్నీ తీసుకురండి

- అమరావతి, పోలవరం, జల్ జీవన్ ఇతర ప్రాజెక్టులకు నిధులు అవసరం
- వెనుకబడిన ప్రాంతాలకూ రాయితీ పథకాలు.. వంద కోట్లు వచ్చేలా ఉన్నా వదలొద్దు
- విభజన హామీల అమలు జరగాలి.. పలు ప్రాజెక్టులపై కేంద్రంతో చర్చించాలి
- ఎంపీలు, మంత్రులతో భేటీలో చంద్రబాబు.. నిధులు రాబట్టడంపై మార్గదర్శకం
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని నిర్దేశం.. ప్రతి 15 రోజులకూ సమీక్షిస్తానని వెల్లడి

అమరావతి, జూలై 20 : కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనంత వరకూ రాష్ట్రానికి నిధులు రాబట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు సూచించారు. కేంద్ర పథకాల కింద వచ్చే నిధులను వేటినీ వదలొద్దని, రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిన నేప?థ్యంలో ముఖ్యమంత్రి కేంద్రంపై ఫోకస్ పెట్టారు. కేంద్ర ప?థకాల నిధులు రాబట్టడం కోసం శనివారం తన నివాసంలో ఎంపీలు, మంత్రులతో ఒక సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఎంపీ రాష్ట్రంలోని మంత్రులతో కూడా సమన్వయం చేసుకొని కేంద్ర పథకాల్లో దేనిని ఏ మేరకు వినియోగించుకోవాలో ఒక ప్రణాళిక ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. ఏదైనా ప?థకం కింద రూ.వంద కోట్లు వచ్చేలా ఉన్నా వదిలిపెట్టవద్దని, అవసరమైతే ఢిల్లీ వెళ్లి కూర్చుని తెచ్చుకోవాలని మంత్రులకు సూచించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి తాను ఎంపీలు, మంత్రులకు అప్పగించిన పనిని సమీక్షిస్తానని, రాష్ట్రం పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా

(మిగతా 2వ పేజీలో)





# యావత్ దేశం దృష్టికి 'ఆటవిక పాలన': వైఎస్ జగన్

- 24న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిద్దాం : వైఎస్ జగన్
- మనతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేద్దాం
- రాష్ట్రంలో సాగుతున్న దారుణకాండను వారికి వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం

అమరావతి: రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే

(మిగతా 2వ పేజీలో)

# ఏటా జూన్‌లో నోటిఫికేషన్లు

చేరాయని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే టీజీపీఎస్సీని రద్దుచేసి, యూపీఎస్సీ చైర్మన్‌ను కలిసి, నిర్వహణలో లోపాల్లేకుండా పరీక్షలు పెట్టామని వివరించారు. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించి, యూపీఎస్సీ తరహాలో మార్పులు చేసి, వెనువెంటనే నోటిఫికేషన్‌లు ఇచ్చామని గుర్తు చేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పూర్తిచేశామని, 11 వేల ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా విద్యార్థుల విన్నపం మేరకు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు వాయిదా వే శామని, వచ్చే నవంబరులో వీటిని నిర్వహిస్తామని తెలిపారు.

**మెయిన్స్ రాసేవారంతా ఉత్తీర్ణులు కావాలి..**

తెలంగాణ బిడ్డలు బాగా మేధస్సు కలిగిన వారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. వీరికి ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం, ఆర్థిక వెసులుబాటు ఇస్తామన్నారు. మెయిన్స్‌కు ప్రిపేర్ కావడానికి వీలుగా ఒక్కొక్కరికి రూ.లక్ష సహాయం అందిస్తున్నామని, మెయిన్స్ రాసేవారంతా తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ సివిల్స్ విజేతలు తమ నడవడికతో పేద వర్గాలకు మేలు చేయాలని, వారి ఆకాంక్షల్ని నెరవేర్చాలని సూచించారు. కాగా, తాను సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే సమయంలో కోచింగ్ కోసం రూ.2 వేలు లభించక ఇబ్బంది పడ్డానని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం అన్నారు. 50 రూపాయల విలువ చేసే పుస్తకం కొనుక్కునేందుకు వారం రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ సందర్భంగా 2023లో సివిల్స్‌కు ఎంపికైన 41 మంది అభ్యర్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరె డ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు రఘురామిరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ప్రతి రూపాయీ రాబట్టండి

పనిచేయాలన్నారు. 'గతంలో మనం అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి ఎంత వీలైతే అన్ని నిధులు తెచ్చి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, నీటి కుంటలు, పశువుల శాలలు వంటివి భారీ సంఖ్యలో నిర్మించాం. అవన్నీ ఇప్పటికీ ప్రతి గ్రామంలో కనిపిస్తున్నాయి. ఈసారి కూడా ఆ పథకం కింద ఎంత వీలైతే అన్ని నిధులు తెచ్చుకొందాం. అలాగే విభజన చట్టం కింద వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాయితీ నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని అడుగుతున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాకు కూడా మైక్రో ఇరిగేషన్ కింద తొంభై శాతం సబ్సిడీ ప?థకం అమలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. ఇది వస్తే రైతాంగానికి చాలా ఊరటగా ఉంటుంది. తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

**చేయాల్సిన పనులు ఇవీ**

'అమరావతి, పోలవరం, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి. విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు జరిగేలా చూడాలి. షెడ్యూల్ 9, 10లో ఉన్న ఆస్తులు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పంపకం జరిగేలా చూడాలి. దీనిపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు మొదలు పెట్టాం. గతంలో మంజూరైన పెట్రోలియం యూనివర్సిటీని విశాఖలోనే ఏర్పాటు చేయాలి. అవసరమైన నిధులు కేంద్రం నుంచి మంజూరు చేయించుకోవాలి. కార్యకలాపాలు వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చూడా లి. కడప ఉక్కుపైనా కేంద్రంతో చర్చలు జరపాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో తప్పు డు ప్రచారాలకు తెరదించాలి' అని చంద్రబాబు సూచించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన లేకపోతే తర్వాత అయినా తెచ్చుకోగలుగుతామని, దానిపై ఆందోళన చెందవద్దని ఒక ఎంపీ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



# జూరాల 17గేట్లు ఎత్తివేత

హైదరాబాద్, జూలై 20 : తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై తొలి ప్రాజెక్టు అయిన జూరాల గేట్లు తెరుచుకున్నాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా శనివారం 17 గేట్లను ఎత్తారు. 1,04,416 క్యూసెక్కులను దిగువకు వదిలారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు 48,026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. నారాయణపూర్ జలాశ యానికి 1,11,236 క్యూసెక్కుల వరద వస్తుండగా 1,08,860 క్యూసెక్కులను కిందకు వదిలారు. ఆల్మట్టికి 1,05,939 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. మరోవైపు తుంగభద్రకు 1,03,956 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. రోజూ 10 టీఎంసీల వరద వచ్చి చేరుతోంది. ఇది కొనసాగితే నాలుగు రోజులలో తుంగభద్ర జలాశయం నిండనుంది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తారు. భద్రాచలం వద్ద గోదావారి 40 అడుగులకు సమీపించింది. మూడు రోజులుగా గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ఇప్పటికే స్నానఘట్టాలు నీట మునిగాయి. ఛత్తీసగఢ్‌తో పాటు, చర్ల మండలంలో భారీ వర్షాలతో తాలిపేరు 25 గేట్లను పూర్తిగా ఎత్తి లక్ష 45వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నల్లగొండ జిల్లా మూసీకి ఇన్‌ఫ్లో శనివారం రెట్టింపైంది. నాగార్జునసాగర్ పూర్తి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 504.60 అడుగులు (122.6854టీఎంసీలు)గా ఉంది. మేడిగడ్డ బ్యారేజీ 85 గేట్లను ఎత్తారు.

# రేపటి నుంచి పార్లమెంటు

న్యూఢిల్లీ, జూలై 20: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దానికి ముందురోజు(సోమవారం) ఆర్థిక సర్వేను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. వివిధ రంగాల ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన గణాంక సమాచారం, విశ్లేషణలతోపాటు ఉపాధి, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, బడ్జెట్‌లోటు తదితరాలను ఆర్థిక సర్వే వెల్లడించనుంది. ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని బృందం ఆర్థిక సర్వేను రూపొందించింది. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకైన కేసు, రైల్వే భద్రత తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. ఆగస్టు 12వ తేదీ వరకు కొనసాగే ఈ సమావేశాలలో 90 ఏళ్ల నాటి పౌర విమానయాన చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం సహా ఆరు బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతోపాటు ప్రస్తుతం కేంద్ర పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ బడ్జెట్‌కు పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ సమావేశాలలో రాజకీయ పార్టీలు ఏఏ అంశాలను లేవనెత్తాలనుకుంటున్నాయో తెలుసుకునేందుకు ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 51 శాతం కంటే తక్కువగా ఉండేలా బ్యాంకింగ్ చట్టాలకు ప్రభుత్వం ఈ సమావేశాలలో సవరణలు తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసే చర్యలను అడ్డుకుంటామని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ సవరణ బిల్లు, బాయిలర్స్ బిల్లు, కాఫీ(ప్రచారం, అభివృద్ధి) బిల్లు, రబ్బర్(ప్రచారం, అభివృద్ధి) బిల్లులను కూడా ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు.

# అన్ని గేట్లు ఎత్తి పెట్టాల్సిందే



మధ్యాహ్నం ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్‌తో సమావేశ మయ్యారు. మంత్రితో పాటు నీటి పారుదల శాఖ కార్యదర్శులు రాహుల్ బొజ్జ, ప్రశాంత్ జీవన్ పాటిల్, ఓఅండ్ఎం ఈఎన్‌సీ నాగేంద్రరావు, కాళేశ్వరం సీఈ సుధాకర్ రెడ్డిలు పాల్గొన్నారు. సుమారు రెండున్నర గంటల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల మరమ్మతులు, నీటి తరలింపు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ సహా ఇతర బరాజ్‌ల్లో మరమ్మతులు, పునరుద్ధరణలో భాగంగా ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు చేపట్టిన పనుల వివరాలను ఇంజనీర్లకు వివరించారు. సీడబ్ల్యూపీఆర్‌ఎస్, సీఎస్ఎమ్మార్‌ఎస్‌కు సంబంధించిన నివేదికలు పూర్తి స్థాయిలో అందనందున బరాజ్‌ల్లో నీటి నిల్వలపై ఇప్పటికిప్పుడు నిర్ణయం చేయలేమని, ఈ దృష్ట్యా అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడమే ఉత్తమమని ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ స్పష్టం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. భేటీ వివరాలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు.

**ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ముందుకు: ఉత్తమ్**

కాళేశ్వరం బరాజ్‌ల విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ముందుకు వెళతామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. 'బరాజ్‌లో నీటి నిల్వలు, వాటిని తిరిగి వినియోగంలోకి తెచ్చే అంశాలపై రెండున్నర గంటల పాటు చర్చించాం. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచనల మేరకు ఇప్పటికే చేపట్టిన పనులను, పరీక్షలను వివరించాం. ఇంకా కొన్ని పరీక్షల ఫలితాలు రావాల్సి ఉందని చెప్పాం. దీనిపై వారు ఇప్పటికైతే అన్ని గేట్లు ఎత్తిపెట్టి నీళ్లు కిందకి వదిలేయండని చెప్పారు. దానికి అనుగుణంగానే అన్ని గేట్లు ఎత్తినీటిని వదిలేస్తాం. దీనిపై కేబినెట్‌లోనూ చర్చించి నిర్ణయాలు తీసుకుంటాం'అని వివరించారు. మేడిగడ్డలో మాత్రం ఒక గేటు పనిచేయడం లేదని, దానిని పూర్తిగా కట్ చేసి మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మేడిగడ్డతో పాటు అన్నారంలో సీపేజీలను, సుందిళ్లలో కొన్ని లోపాలను కేంద్ర సంస్థ గుర్తించిందని, ప్రజా జీవితాలకు సంబంధించిన విషయమైనందున నిపుణుల సూచన మేరకే ముందుకెళ్తామన్నారు. ఎల్లంపల్లి ఎగువన నీటిని వినియోగించుకొని, ఆయకట్టుకు నీటిని అందించే అవకాశాలన్నింటినీ పరిశీలిస్తున్నామని మంత్రి చెప్పారు.

**కుంగిందెప్పుడు..ఆర్కిటెక్ట్ ఎవరు..?**

ఈ సందర్భంగా కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్‌ని వినియోగించుకోవడంతో కాంగ్రెస్ విఫలమైందంటూ బీఆర్‌ఎస్ నేత మాజీ మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలపై మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. 'కేవలం కమిషన్‌ల కోసం తుమ్మడిహెట్టి డిజైన్‌ను మేడిగడ్డకు మార్చారు. రూ.38వేల కోట్లతో పూర్తయ్యేదాన్ని రూ.1.50లక్షల కోట్లకు పెంచారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని తప్పుడు లెక్కలు చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడితే ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చని అంచనా వేస్తే, ఇప్పుడు కాళేశ్వరంతో ఏటా ఖర్చు రూ.10వేల కోట్లకు చేరుతోంది. ప్రాజెక్టుకు తెచ్చిన అప్పులపై వడ్డీలకే ఏటా రూ.15వేల కోట్లవుతున్నాయి. ఇంతా చేసి ఏడాది 13 టీఎంసీల చొప్పున ఐదేళ్లలో 65 టీఎంసీలు ఎత్తిపోశారు. దీనికి కర్త, ఆర్కిటెక్ట్, బిల్డర్ అన్నీ కేసీఆర్ అన్ని గొప్పలు చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉండగానే మేడిగడ్డ కుంగితే మాత్రం ఒక్క మాట మాట్లాడలే. ప్రాజెక్టు నాశనం చేసిన వాళ్లే ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారు. అబద్ధాలు చెప్పడానికైనా కేటీఆర్‌కు హద్దుండాలి'అని ఉత్తమ్ విరుచుకుపడ్డారు.

**మా హయాంలోనే తుమ్మిడిహెట్టి పూర్తి..**

ఇక తమ హయాంలోనే తుమ్మిడిహెట్టి బరాజ్‌ని పూర్తి చేస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్ర స్తుత వరద దృష్ట్యా ఏ ప్రాజెక్టులోనూ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ఇంజనీర్లను అప్రమత్తం చేశామన్నారు. ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజె క్టు అంతరాష్ట్ర ప్రాజెక్టు అని, 90 శాతం ఆయకట్టు ఏపీలో ఉందని, ఐదు అడుగుల మేర వరద రావడంతో అక్కడ కొన్ని ఇక్కట్లు ఎదురయ్యాయని ఉత్తమ్ వెల్లడించారు.

# నిరుద్యోగులకు కాంగ్రెస్ దగా..

## 2 లక్షల ప్రభుత్వ కొలువులు..

## గ్యారెంటీలు ప్రజలకు గుదిబండలు

## రాష్ట్రంలో మంత్రుల దోపిడీ: కిషన్‌రెడ్డి



కవాడిగూడ/హైదరాబాద్, జూలై 20 : అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఏమైయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాట తప్పారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలు ప్రజలకు గుదిబండలుగా మారాయని అన్నారు. వంద రోజుల్లో హామీలను నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు అండగా ఉంటామని సమావేశాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడు వారిని దగ్గరకు కూడా రానివ్వడం లేదని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. నిరసన తెలిపితే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని.. గ్రూప్-1, 2 పోస్టులను పెంచలేదని బీజేవైఎం గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. నిరుద్యోగులకు రూ.4వేల చొప్పున భృతి ఇవ్వాలని, 9వేలకు పైగా పోస్టులతో కొత్తగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేసింది.

**ఏఐతో ఖనిజాల అన్వేషణ**

భారత్‌లో కృతిమ మేధ(ఏఐ), మెషీన్ లర్నింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగంలో పురోగతి సాధిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా రూపొందడంలో ఖనిజాల పాత్ర కీలకం అవుతుందన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని ఓ హెూటల్‌లో శనివారం ఖనిజాన్వేషణ హ్యాకథాన్, నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ 2, 3 వేలం పాటల్లో ఎంపికైన 8మంది బిడ్డర్లకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం 4వ విడత వేలాన్ని ప్రారంభించారు.

**పెద వాగు బాధితులకు సంజయ్ ఫోన్**

పెదవాగు వరదలో చిక్కుకుపోయి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో బయటపడిన నారాయణపురం గ్రామస్తులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్వహణ లోపం, సిబ్బంది కొరత వల్లే ఈ నష్టం వాటిల్లిందని గ్రామస్తులు సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని సంజయ్ వారికి హామీ ఇచ్చారు. రుణమాఫీ విషయంలో మ్యానిఫెస్టోలో లేని షరతులు అధికారం చేపట్టాక ఎలా వచ్చాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిలదీశారు. రైతు భరోసాలోనూ మోసం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు.

# యావత్ దేశం దృష్టికి 'ఆటవిక పాలన': వైఎస్ జగన్

ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశా నిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్బోధించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన తాడే పల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. 'ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హెూం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాం. అపాయింట్‌మెంట్లు రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తాం. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీ ఒక్కో బాధ్యత తీసుకోవాలి. వెంటనే ఢిల్లీ వెళ్లి ఆ పనుల్లో నిమగ్నం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. అందుకే మనం రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం. అలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలి. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తాం. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో దారుణాలు, అరాచకాలు, ఇక్కడ జరుగుతున్న ఘటనలపై అందరూ గళమెత్తాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**ప్రజాస్వామ్య మనుగడకే పెను ప్రమాదం**

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదు. అవి ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బ. అందుకే అన్ని పార్టీలకూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయి. వినుకొండలో రషీద్ హత్యే ఇందుకు పరాకాష్ట. ఆ హత్య వీడియో దృశ్యాలు.. రాష్ట్రంలో దారుణంగా ఉన్న శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అమానుషం. తమ రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఇది. వినుకొండలో దారుణ హత్యకు గురైన పార్టీ కార్యకర్త రషీద్ ఒక వైన్ షాపులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఆ రాజకీయ హత్య ఘటనను వక్రీకరించడానికి ఎల్లో మీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, ఇప్పుడు జరిగిన దారుణ హత్యకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఆ కాలిన బైక్.. వైఎస్సార్‌సీపీ వాళ్లది. ఇందుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. దాన్ని కూడా ట్విస్ట్ చేసి, నానా తప్పుడు రాతలు రాస్తున్నారు. అసలు తమ కొడుకు ఏం తప్పు చేశాడని రషీద్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. 'సీఎంగా వైఎస్ జగన్ ఉంటే.. అంతా మంచి జరుగుతుందని నమ్మడం మా తప్పు అవుతుందా?' అని వారు ప్రశ్నిస్తున్నారు. హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను రషీద్ తల్లిదండ్రులు చూపారు. స్థానిక ఎమ్మెల్యేతో కూడా కలిసి దిగిన హంతకుడి ఫొటోలను వారు చూపించారు.

**హత్యలు.. హత్యాయత్నాలు.. వేధింపులు.. విధ్వంసాలు**

పల్నాడు జిల్లాకు కొత్త ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే హత్యతో సహా పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. అంతకు ముందు మల్లికా గార్గ్ జిల్లా ఎస్పీగా ఉన్నారు. ఆమె సమర్థురాలు. అందుకే ఆమెను ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేశారు. తమకు అనుకూలంగా ఉండే ఎస్పీని నియమించుకుని ఈ దారుణాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ వారి వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. ఇళ్లల్లోకి చొరబడుతున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. షాపులను కాల్చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకు చెందిన చీనీ చెట్లు నరికేస్తున్నారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. ఇవి కాక 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి. హత్యలు, దాడులు చేయడానికి టీడీపీ వాళ్లకి లైసెన్స్ ఇచ్చినట్టుగా ఉంది.

**ఎంపీపైనా యథేచ్ఛగా దాడి**

మరోవైపు తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఒక న్యాయవాది. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి.. వాహనాలు కూడా ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్పకు చెందిన వాహనాన్ని దగ్ధం చేశారు. అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి మన పార్టీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారు.

# గందరగోళంగా రుణమాఫీ నిబంధనలు

## అర్థం కాక ఆందోళనలో రైతులు

జన సముద్రం న్యూస్, కోహెడ, జూలై 20 : (కోహెడ ప్రసాదరావు) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు లక్షల వరకు ఉన్న రైతుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి ప్రస్తుతం అనేక నిబంధనలతో రుణమాఫీ జరుగుతుందో లేదో అని రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నట్లు స్థానిక సింగిల్ విండో చైర్మన్ పేర్ల దేవేందర్ రావు అన్నారు. శనివారం ఈ మేరకు ఆయన విలేకరులకు ఒక పత్రికా ప్రకటన పంపించారు. కొత్త ప్రభుత్వం ఇప్పుడు కొత్త కొత్త నిబంధనలతో తెలంగాణ రైతాంగాన్ని మోసం చేసే ప్రయత్నం చేస్తుందని అందులో పేర్కొన్నారు. మొదట లక్ష రూపాయల లోపు రుణ మాఫీ పేరుతో విడుదల చేసిన జాబితాలో ఎందరో మంది అర్హులైన రైతుల పేర్లు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని ఆయన అన్నారు. అసలు తమ పేరు ఎందుకు లేదో, ఈ విషయాన్ని ఎవరిని అడగాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని అందులో వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే అర్హులైన అందరు రైతుల పేరుతో ఎటువంటి షరతులు లేకుండా జాబితా విడుదల చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.బతుకు తెరువు కోసం ఆటో లోన్, ట్రాక్టర్ లోన్ కావాలి అంటే ఐటీ ఫైల్ చేసుకోవాలని ఫైనాన్స్ కంపెనీలు చెప్తే ఆదాయ పన్ను పరిమితి లోపే ఐటీ ఫైల్ చేసినా కూడా వారికి రుణ మాఫీ వర్తించదని పేర్కొనడం వారికి తీవ్రమైన అన్యాయం చేయడమే అవుతుందని అందులో పేర్కొన్నారు. లోన్ ఆశతో తెలిసి తెలియక ఐటీ ఫైల్ చేయడం వారి పాలిట శాపంగా మారిందని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి పునరాలోచన చేసి ఐటీ ఉన్నప్పటికీ పేదలైన వారికి రుణ మాఫీ జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని గత ఏడు నెలలుగా కాలయాపన చేసినందున ప్రభుత్వం ఈ ఏడు నెలల వడ్డీ తో కలిపి మొత్తం



రుణం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు తప్పనిసరి కాదని అందరికీ రుణ మాఫీ చేస్తామని సీఎం మరియు ఇతర మంత్రులు బహిరంగగా ప్రకటనలు చేస్తున్నారని ఆయన వివరించారు. కానీ రుణమాఫీ జీవో లో మాత్రం రేషన్ కార్డు తప్పనిసరి అని ఇచ్చారని తెలిపారు. ఈ గందరగోళ పరిస్థితుల్లో రుణం మాఫీ అవుతుందో లేదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.కొత్త ప్రభుత్వం గద్దెనెక్కిన ఆరు నెలల తర్వాత చేసిన కార్యక్రమం కూడా ఏదో హడావిడిగా చేసినట్టు, చెప్పే వాటికి చేస్తున్న వాటికి పొంతన లేకుండా ఉన్నదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ముఖ్యమంత్రి ఇతర మంత్రులు సమన్వయంతో వ్యవహరించి ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకుండా ఎటువంటి షరతులు లేకుండా రెండు లక్షల వరకు ప్రతీ రైతుకు రుణ మాఫీ చేయాలని తెలంగాణ రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.



# హుజురాబాద్ బస్టాండ్ ప్రాంతంలో గుంత

## ఆదమరిస్తే అంతే సంగతులు

జనసముద్రం న్యూస్ ప్రతినిధి కరీంనగర్ జూలై 20:హుజురాబాద్ బస్టాండ్ ప్రాంతంలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో గుంత ఏర్పడిన అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గుంతలో వర్షం నీరు నిండి ఏర్పడకుండా ఉంది దీంతో ఆదమరిచి ఎవరైనా అడుగు వేస్తే ప్రమాదం బారిన పడక తప్పదని పలువురు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు



# వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేసిన జూపల్లి

జన సముద్రం న్యూస్. అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి గ్రామం లో వరద ప్రభావం తో ఇళ్లల్లో వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు అశ్వారావుపేట శాసనసభ్యులు జరే ఆదినారాయణ ,అదేశనుసరం అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి రమేష్ బాబు గుమ్మడివల్లి గ్రామం లో పర్యటించి బాధిత కుటుంబాలకి దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ విపత్కార పరిస్థితుల్లో బాధితులకి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో అశ్వారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నంద్రు రమేష్ , జూపల్లి ప్రమోద్ , గుమ్మడివల్లి గ్రామస్తులు చెన్నారెడ్డి , తిరుపతి రావు సత్తిబాబు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ మాట అంగన్ వాడి బాట లో అక్షరాభ్యాసం

కామేపల్లి, జనసముద్రం,జూలై 20 : అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమం ను కామేపల్లి హరిజనవాడ అంగన్వాడీ కేం ద్రంలో శనివారం నిర్వహించారు.ఈ కార్య క్రమంలో భాగంగా నూతనంగా కేంద్రంలో చేరిన చిన్నారుల చేత అక్షరాభ్యాసం చే యించారు.ఈనెల 15 నుండి అమ్మ మా ట అంగన్వాడి బాట కార్యక్రమం ను విజ యవంతంగా నిర్వహిస్తున్నారు.రెండున్న ర సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేం ద్రంలో చేర్పించాలని అంగన్వాడీ టీచర్ పిడమర్తి ఉపేంద్రమ్మ ఈ సందర్భంగా త ల్లులను కోరారు.కార్యక్రమం విశిష్టత, ప్ర యోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఉషారాణి, ఆశా కార్యకర్త కె.నీల, తల్లులు సిహెచ్ స్వరూప, ఏ.కళ్యాణి, జి.స్వప్న, ఏ.పార్వతి,ఆర్. రా ణి, జి.కుమారి,ఈ.కళ్యాణి,వి. సింధు, ఉ ష, లలిత తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గోపాలపురం అంగన్వాడి కేంద్రం లో కూడా అంగన్వాడీ టీచర్ ఏర్పుల జ్ఞా నమ్మ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగ న్వాడి బాట కార్యక్రమాన్ని పండుగ వాతా వరణం లో కోలాహాలంగా నిర్వహించారు.నూతనంగా చేరిన పిల్లలకు అక్షరాభ్యా సం చేశారు.ఐసిడిఎస్ సేవలను సద్విని యోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్ర మంలో తల్లులు, గర్భిణీలు, పిల్లలు, గ్రామ స్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

## జంగిలి యాదగిరి బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు

వెల్దండ,జూలై,21(జనసముద్రం న్యూస్)రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ పథకం పల్లెల్లో గందరగోళాన్ని సృష్టిస్తుందని జంగిలియాదగిరి అన్నారు, యాదగిరి మాట్లాడుతూ ఎటు పొంతన లేని నిబంధనలు పెట్టి కొంతమందికి పంటరుణమాఫీ చేసి మరి కొంతమందిని విస్మరించడంతో కొందరు రైతులు ఆందోళనలకు గురిగావడంతోపాటు ఆత్మస్థైర్యాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది అని అన్నారు,అలాగే రేషన్ కార్డును ప్రాతిపదికగా తీసుకొని పంట రుణమాఫీ చేయడం వల్ల పచ్చని కుటుంబాలలో ప్రభుత్వం చిచ్చు పెట్టినట్లయింది అని అన్నారు, ఒకవైపు వానకాలం పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో పంట రుణమాఫీ కానీ రైతులు పనులన్నీ వదులుకొని కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది, ఒకవైపు అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పడం, మరోవైపు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం, అన్ని అర్హతలో ఉన్న జాబితాలో పేర్లు రాకపోవడం, జాబితాలో పేర్లు వచ్చిన ఇంకా బ్యాంకు ఖాతాలో డబ్బులు పడకపోవడం రైతులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు,ఈ కార్యక్రమంలో మండల యువ నాయకులు మాజీ వార్డుసభ్యులు శేఖర్,పోలే అశోక్,ఏకుల శీను, గణేష్,ఈదులపల్లి శ్రీను,జోగు రవి, మహేష్,మొదలగువారు పాల్గొన్నారు

# జోరు వర్షంలో సైతం బాధిత ప్రాంతాలలో పర్యటిస్తూ ఆ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం. వెంకట్రావు.

జనసముద్రం జూలై 20 బ్యూరో చీఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా.గత రెండు రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జోరుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు.రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న కారణంగా భద్రాచలం నియోజకవర్గం లో ని కొన్ని ప్రాంతాలకు ప్రయాణం ఇబ్బందిగా మారింది.విస్తృత వర్షాల కారణంగా భద్రాచలం పట్టణం పల్లపు ప్రాంతాలలో వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న కాలనీలలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం .వెంకట్రావు ఈ రెండు రోజులు జోరుగా కురుస్తున్న వర్షంలో సైతం పర్యటిస్తూ వర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు.ఈరోజు శనివారం అశోక్ నగర్ కాలనీలో పర్యటన చేసి కాలనీ వాసులు తెలిపిన ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే వెంకట్రావు తెలియజేశారు. వర్షాకాలం కావడం వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే ఉపయోగించాలని తద్వారా చిన్నపిల్లల ఆరోగ్యాలను కూడా సంరక్షించుకోవచ్చని ప్రజలకు తెలియజేశారు.జోరున వర్షం కురుస్తున్నా పట్టణంలో పర్యటిస్తూ ప్రజల బాగోగులను చూస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావుకు ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.ఇది ఇలా



ఉండగాఅధిక వర్షాల కారణంగా నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం .అధికారులను కోరారు.



# పెద్దవాగు ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో పర్యటించిన తాటి

## అధికారుల అలసత్వం వల్లే పెద్దవాగు ప్రాజెక్టు గండి

జనసముద్రం న్యూస్. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటివెంకటేశ్వర్లు పెద్దవాగు ప్రాజెక్ట్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల బాధ్యతా రహిత్యం వల్లనే మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిందన్నారు.. పెద్దవాగు ప్రాజెక్ట్ కట్ట తెగిపోవడంతో గుమ్మడిపల్లి పరిసర ప్రాంత గ్రామాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందిని రాబోయే రెండు పంటలు పండించే అవకాశం లేకుండా పోయిందన్నారు.. 1982లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ ప్రాజెక్టు నిర్మించారు,అన్నారు.. పెద్దవాగు ప్రాజెక్టులో 16 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది, అందులో తెలంగాణ పరిధిలో2400 మిగతా ఆయకట్టు మొత్తం ఆంధ్రాలో ఉండడం వాళ్ళ ఇరు రాష్ట్ర ప్రభుత్వ లు చొరవ తీసుకొని వెంటనే ప్రాజెక్టు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు, పంట మరియు గొర్రెలు, మేకలు, పశువులు నష్టపోయిన వారికీ తక్షణమే నష్టపరిహారం అందించాలని, ప్రాజెక్టు గండి పడటంతో ఈ ప్రాంత ప్రజలు పంట పండించే ఆదరువు కోల్పోయారు కనుక వారికీ ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అంకిత మల్లికార్జున రావు , చిన్నంశెట్టివెంకట నరసింహారావు. పొట్ట రాజులు , కాసాని చంద్రమోహన్ , సత్యవరపు సంపూర్ణ , మోటూరు మోహన్ , తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# మోడల్ స్కూలుకు బీటీ రోడ్డు సీసీ రోడ్డు వేయాలని పేరెంట్స్

## తాసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చారు

ఎల్కతుర్తి జులై 20 జనసముద్రం న్యూస్ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎల్కతుర్తి సిద్దిపేట హైవే నుండిదారి మెయిన్ రోడ్డు స్కూల్ వరకు ఉన్న మట్టి రోడ్డు వర్షాకాలం ప్రభావం చేత గుంతలు గుంతలు గా పడి బడి పిల్లలు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. కావున దీన్ని తక్షణమే మరమ్మత్తు చేయించి శాశ్వత పరిష్కారానికి సిమెంటు రోడ్డు వేయించగలరని మోడల్ స్కూల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు సంబంధిత ఎల్కతుర్తి డిప్యూటీ ఎమ్మార్వో గారికి వినతి పత్రం మరియు ఎంపీడీవో గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. కావున ఈ అంశంపై తక్షణమే చర్యలు తీసుకొని మరమ్మత్తులు చేయించగలరని బడి పిల్లల తల్లిదండ్రులు వేడుకోవడం జరుగుతుంది. మోడల్ స్కూల్ పిల్లలు తల్లిదండ్రులు హింగె భాస్కర్. హింగే.రాజు, రమేష్, గొర్రె శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, మంకని చేరాలు, నరేష్ తదితరులు ఈ వినతి పత్రాన్నీ ఇవ్వడానికి హాజరైన వారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

## ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు బానవత్ శంకర్ నాయక్

వెల్దండ,జూలై,21(జనసముద్రం న్యూస్)తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు 2 లక్షల రుణమాఫీని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్,ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యని ర్వాహక అధ్యక్షులు బానవత్ శంకర్ నాయక్ లు హైదరాబాధ్ లోని గన్ పార్కు వద్ద అమరవీరుల స్థూపా నికి,రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తాను అన్న మాజీ మంత్రి హరీష్ రావు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.10 సంవత్సరాల బిఆర్ ఎస్ పాలనలో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపో యారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుం దని అన్నారు.బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు మానిలని హితవు పలికారు



# ఎమ్మార్వో కు వినతి పత్రం..

## ముదిరాజ్ బి సి డి నుంచి ఏ కి మార్చాలి

జనసముద్రం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:భువనగిరి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచి ముదిరాజులకు ఇచ్చినటువంటి అభయ హస్తం హామీలు 1.ముదిరాజులను బీసీ- డీ నుండి బీసీ- ఏ కు వెంటనే మార్చడం , 2.ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పరచి 1000 కోట్ల నిధులు మంజూరు చేయాలి,3. చెరువులు/ కుంటలపై ముదిరాజ్ /బెస్తలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలి.4. మత్స్యకారుల అభివృద్ధికి వివిధ పథకాలు 75% సబ్సిడీతో మంజూరు చేయుటకు 1000 కోట్లు కేటాయించాలి అనే ప్రధాన డిమాండ్ల తో అన్ని మండల కేంద్రాలలో ఎమ్మార్వో వినతి పత్రాలు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పెంట నరసింహ ఎక్స్ చైర్మన్, ఎన్నబోయిన ఆంజనేయులు ఎక్స్ మున్సిపల్ చైర్మన్, పల్లెపాటి బాలయ్య , ఇట్టబోయిన గోపాల్, ఎనబోయిన జాంగిర్, పిట్టల బాలరాజ్ ఉడుత భాస్కర్, ఎనబోయిన సత్యనారాయణ,కృష్ణ,, తుమ్మల పండు, కుక్కదుగు పద్మ, మల్లికా, బింధూ,దొప్ప వెంకటేష్,ఇండ్ల వెంకటేష్, చిన్న కృష్ణ, తుమ్మల నాగేష్, మేడబోయిన సాయి ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## కురవి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన కొర్ని అనిల్.



జన సముద్రం జూలై 20 (డోర్నకల్ డివిజన్) కురవి మండలం యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి కురవి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ యూత్ నాయకులు కొర్ని అనిల్ నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కొర్ని అనిల్ మాట్లాడుతూ కురవి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే కురవి మండలాల్లోని చుట్టుపక్కల కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు అలాగే గ్రామ యూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాను నూతన అధ్యక్ష పదవులకు జిల్లా అధ్యక్షుల పదవులకు మండల అధ్యక్షులు పదవులకు టీపీసీసీ చర్యలు చేపట్టిన అందులో భాగంగా కురవి అధ్యక్ష పదవికి కొర్ని అనిల్ ఆన్లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశారు .కురవి అధ్యక్ష పదవికి డోర్నకల్ నియోజకవర్గ నుండి నేను బారిలో నిలుస్తున్నానని మీ అందరి సహకారంతో అండదండలు ఉండాలని కోరుకుంటున్నాను.

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడుగా నామినేషన్ వేసిన సభవత్ రమేష్ నాయక్



వెల్దండ,జూలై,21(జనసముద్రం న్యూస్)తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవికి సభావత్ రమేష్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు.వెల్దండ మండల పరిధిలోని పలుగు తండా కు చెందిన రమేష్ నాయక్ 2013 నుంచి 11సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు.ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఉన్నారు.యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనేక పోరాటాలు చేశారు. ఆగస్టులో జరిగే యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచారు.





## ఘనంగా బూడిద బిక్షమయ గౌడ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ర్యాకల శ్రీనివాస్.

జన సముద్రం:యాదాద్రి భువనగిరి ప్రతినిధి:-ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ పుట్టినరోజు సంధర్భంగా వారిని అలేరులోని ప్రకాష్ గర్డెన్స్లో వారు నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో భువనగిరి బి.అర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, వలిగొండ మాజీ జడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్, వలిగొండ మాజీ ఎంపీటీసీ పల్సం రమేష్, బి.అర్.ఎస్ జిల్లా నాయకులు డా'' ర్యాకల శ్రీనివాస్, మాధ శంకర్ గౌడ్, లింగరాజ్పుల్లి మాజీ సర్పంచ్ బొడ్డుపల్లి కృష్ణ తదితర నాయకులు కార్యక్రమంలో పాల్గొని వారికి శాలువాలతో సన్మానాలు చేసి వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు ఘనంగా తెలియజేశారు.



## ఎమ్మెల్యే బిఎల్ఆర్ చొరవతో మెడికల్ క్యాంపు ఏర్పాటు

దామరచర్ల మండలం.జులై 20.(జనసముద్రం న్యూస్):వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మండల ప్రజలకు సూచించారు,మండలంలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నారు,ఇట్టి విషయమై శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వైద్యాధికారులకు వైద్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు తగిన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు,ఎమ్మెల్యే ఆదేశాలనుసారం పీహెచ్ సి వైద్య అధికారుల బృందం మండలంలోని పలుచోట్ల వైద్య కేంద్రాలను ఏర్పాటు చేశారు,పిహెచ్ సి అధికారులు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి డెంగ్యూ,మలేరియా ఇతరతర కారణాలచే వచ్చే జ్వరాలకు తగిన చికిత్సను అందిస్తామన్నారు,అలాగే స్థానిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల బెడద నుండి విముక్తిగా ఉండాలని వానాకాలం వచ్చే సీజనల్ డిసీస్ ముఖ్యంగా టైఫాయిడ్,నీళ్ల విరోచనాలు,ఒళ్ళు నొప్పులతో అధికముగా ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్ సి వైద్య కేంద్రాలను సంప్రదించి తగిన చికిత్సలు తీసుకోవాలన్నారు,అనంతరం ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాలం వెంకన్న యాదవ్,పీహెచ్ సి అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లు వద్దు.. శ్రద్ధతో చదవడం ముద్దు

**-సైబర్ నేరాల పట్ల అప్రమత్తం.**

**-విద్యార్థులకు ఏసీపి సతీష్ దిశా నిర్దేశం**



జన సముద్రం న్యూస్, కోహెడ, జూలై 20 : (కోహెడ ప్రసాదరావు)చెడు అలవాట్లకు దూరంగా ఉండి శ్రద్ధతో చదివి పైకి రావాలని హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు , సీసీ కెమెరాలు, ఈవిటీజింగ్ సైబర్ నేరాల గురించి, నూతన చట్టాల పై శనివారం హుస్నాబాద్ షీ టీం బృందంతో కలిసి ఏసీబీ సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదు,ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని,తల్లిదండ్రులను విద్యను నేర్పిన గురువులను జీవితంలో ఎప్పుడూ మర్చిపోవద్దని మంచి క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా ఎదగాలని ఆయన సూచించారు.సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలనిగుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు వెల్లడించవద్దని సూచించారు.తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలని ఉద్బోధించారు.నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని, గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని హెచ్చరించారు.నేడు ప్రభుత్వ ఉద్యోగానికైనా ప్రైవేట్ ఉద్యోగానికైనా తప్పకుండా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ చాలా ముఖ్యమని,చిన్నచిన్న గొడవలకు పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని విద్యార్థులను కోరారు.షీటీమ్ యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల గురించి, ఫోక్సో చట్టాలు మరియు బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాల గురించి, ఇవి టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాల గురించి, సోషల్ మీడియా దాని యొక్క పరిణామాల గురించి, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు లాభాల గురించి. గతంలో జరిగిన నేరాల గురించి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి. భరోసా సెంటర్లో ఫోక్సో కేసులలో 18 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలకు అందిస్తున్న సేవల గురించి. మహిళలు గృహహింసకు వరకట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసించే తదితర అంశాల గురించి స్నేహిత మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. విద్యార్థులు యొక్క గోల్ గురించి. అపరిచిత వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలని అంశాల గురించి. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, మరియు తదితర అంశాలు, చట్టాల గురించి విద్యార్థినిలకు వివరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని సూచించారు. జులై 1 నుండి అమలైన నూతన చట్టాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. మరియు ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, మరియు అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ కార్యాలయం నుండి జారీ చేయనైనది.

# కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై పోరాటాలకు సిద్ధం కండి

**ప్రజల మద్దతు ఆశీర్వాదంతో దేశంలో మూడోసారి మోడీ ప్రభుత్వం**

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**







జనసముద్రం న్యూస్ ప్రతినిధి కరీంనగర్ జూలై 20:స్వతంత్ర భారతదేశ చరిత్రలో నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ పదవి బాధ్యతలు చేపట్టారని, దేశ ప్రజలంతా బిజెపి ప్రధాని మోడీ పాలనపై విశ్వాసంతో ఉన్నారని, ప్రజల మద్దతు ఆశీర్వాదంతోనే దేశంలో బిజెపి శకం నడుస్తుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ విస్తృత కార్యవర్గ సమావేశం శనివారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాలిడే జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ 7 నెలల కాలంలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ లెక్కలేని హామీలు ఇచ్చిందని, ప్రధానంగా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజానీకాన్ని నమ్మించి మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలో ఏ ఒక్క స్కీమ్ ను సక్రమంగా అమలు చేయలేదని , అన్ని పథకాలకు కండిషన్లు పెడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రజల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేయడానికి బిజెపి శ్రేణులంత సిద్ధం కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పని అయిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ శక్తిగా బిజెపి మాత్రమే ఉందన్నారు. రాబోయే రోజుల్లో బిజెపిని మరింత బలోపితం చేయడానికి పార్టీ నాయకులు కార్యకర్తలంతా సమిష్టి కృషి చేయాలన్నారు. కార్యవర్గ సమావేశానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, బంగారి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ లకు అభినందనలు తెలియజేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే బిజెపిని ఎన్నికల్లో ఆదరించి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను రెండవసారి భారీ మెజారిటీతో గెలిపించినందుకు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టారు



## పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించిన డిసిపి

యాదాద్రి భువనగిరి జిల్లా జులై.20,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర యాదాద్రి భువనగిరి జోన్ లోని పోలీస్ స్టేషన్లు,అడిషనల్ డిసిపి,ఏసిపి,సిఐలు మరియు ఎస్ఐలతో క్రైమ్ రివ్యూ మీటింగ్ ను భువనగిరి హెడ్ క్వార్టర్ లో నిర్వహించారు.ఈ సమీక్ష సమావేశంలో హాలో స్టేషన్లో పెండింగ్ లో ఉన్న కేసులు త్వరగా పూర్తి విచారణ చేయాలని,దానికై పలు సూచనలు చేశారు.అలాగే దొంగతనాలకు సంబంధించిన కేసులలో వాటిని ఛేదించడం గురించి తెలిపారు.



## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల

యాదాద్రి భువనగిరి జిల్లా జూలై.20,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండల పరిధిలోని జైనపల్లి బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాక్కిర్తి గణేష్ తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో శనివారం ఉదయం మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మృతురాలి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీబీనగర్ మండల మాజీ రైతు బంధు కోఆర్డినేటర్ బొక్క జైపాల్ రెడ్డి,బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి,మాజీ సర్పంచ్ తంతరపల్లి అంజయ్య గౌడ్,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సోం శ్రీనివాస్,తాజా మాజీ ఉప సర్పంచ్ రమేష్ ముదిరాజ్,బిఆర్ఎస్వి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కినగేష్,దబ్బటి బాలపోచయ్య,మాజీ వార్డ్ సభ్యులు హరిబాబు ,భాస్కర్,రమేష్, గణేష్, కుమార్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత

జనసముద్రం న్యూస్ ప్రతినిధి కరీంనగర్ జూలై 20:

హుజురాబాద్ ప్రాంతానికే పెద్దదిక్కుగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించే ఆరుగురు వైద్యులు బదిలీ కాగా వారి స్థానంలో తిరిగి ముగ్గురిని నియమించడం అధికారుల తీరును విమర్శలకు దారి తీస్తుంది. హుజురాబాద్ నుండి బదిలీ అయిన వారిలో డాక్టర్ వాణిలత కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి బదిలీ కాగా, డాక్టర్ పల్లవి మాత శిశు సంరక్షణ కేంద్రం కరీంనగర్ కు బదిలీ అయ్యారు. అలాగే డాక్టర్ శ్రీనివాస్ జిల్లా ఆసుపత్రి కరీంనగర్ కు బదిలీ కాగా, డాక్టర్ ప్రత్యూష పరకాల ఏరియా ఆసుపత్రికి బదిలీ అయ్యారు. డాక్టర్ అర్చన వర్ధన్నపేట ఏరియా హాస్పిటల్ కు బదిలీ కాగా, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కరీంనగర్ నుండి డాక్టర్ నిశ్చల గైనకాలజిస్ట్, డాక్టర్ సుభాంగిని పీడియాట్రీషియన్, డాక్టర్ రాజేష్ జనరల్ మెడిసిన్ వైద్యులు హుజురాబాద్ కు బదిలీ పై రానున్నారు. అయితే హుజురాబాద్ నియోజకవర్గంలోని సుమారు 110 గ్రామాలకు పెద్దదిక్కుగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో అసలే అరకోరగా ఉన్న వైద్యులలో ఉన్నవారి నుండి ఆరుగురు వైద్యులను బదిలీ చేయగా వారి స్థానంలో కేవలం ముగ్గురు వైద్యులను మాత్రమే తిరిగి నియమించడం పలు విమర్శలకు దారితీస్తుంది. అసలే అరకొరగా అందుతున్న వైద్య సేవల పట్ల ప్రజల నుండి అనేక విమర్శలు వస్తుండగా, ఏలాంటి చిన్న విషయమైనా వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ఇతర ప్రైవేటు దావకాండ్లకు రేఫర్ చేస్తున్న వైద్యులతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఉన్న వైద్యులలో ఆరుగురిని బదిలీ చేసి అందులో సగం మందిని మాత్రమే తిరిగి నియమించడం ప్రజలకు వైద్య సేవలపై నమ్మకం సన్న గిల్లేలా చేస్తుంది. ఇప్పటికైనా హుజురాబాద్ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి పై ప్రత్యేక దృష్టి పెట్టి సరిపడా వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం



# ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా.

## ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుపుతున్న వాహనదారులు.

## ఎన్నిసార్లు డ్యామేజ్ అయిన మొద్దు నిద్రలో ఆర్ అండ్ బి అధికారులు.

## ఇల్లందు నుండి మహబూబాబాద్ వెళ్లే ప్రధాన రహదారికి మోక్షం ఎప్పుడు




జన సముద్రం న్యూస్ జులై 21 మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సత్యనారాయణపురం నుండి నామలపాడు వరకు ప్రధాన రహదారిపై భయంకరమైన గుంతలు ఏర్పడి వాహనాలను నడుపుతున్న వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు ఈ గుంతల వల్ల అనేకమైన యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి అధికారులు మాత్రం పట్టీ పట్టనుటగా వ్యవహరిస్తున్నారు ఎన్నిసార్లు ఈ రోడ్డు గుంతలపై కంప్లైంట్ చేసిన తాత్కాలికంగా కంకర పోయించి వెళుతున్నారు ఇలాంటి గుంతలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు ఇకనైనా జిల్లా కలెక్టర్ ఇల్లందు ప్రధాన రహదారిపై చొరవ చూపించి మరమ్మతులు చేయించగలరని కొత్తపేట గ్రామ ప్రజానీకం వాపోతున్నారు భద్రాచలం నుండి హైదరాబాదు వరకు ఇసుక లారీలు వందలలో ఈ రహదారిపై ప్రతిరోజు ప్రయాణం చేయడం వల్ల ఈ భయంకరమైన గుంతలు ఏర్పడినాయి కార్లు మోటార్ సైకిళ్ళు మీ గుంతల వల్ల స్కిడ్ డై పడిపోతున్నాయి ఈ క్రమంలో చాలామందికి కాళ్లు చేతులు విరిగి హాస్పటల్లో చికిత్సలు పొందుతున్నారు ఇకనైనా మహబూబాబాద్ నుండి ఇల్లందు వెళ్లే ప్రధాన రహదారిపై మరమ్మత్తులు చేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని జిల్లా కలెక్టర్ కి విన్నవించుకుంటున్నాం



# బీజేపీయువమోర్చ" ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్.

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ జూలై 20:ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: నీకు అనుకూలంగా ఉన్న చానల్లో మీకు ప్రచారం చేయొచ్చు కానీ మీరు చేస్తున్న తప్పులను ప్రజలు లెక్కబెడుతున్నారు.రేవంత్ రెడ్డి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు..జి హుజూర్ అన్న అధికారులకు ఏ గతి పట్టిందో గుర్తుపెట్టుకోవాలి. పోలీసులు లాటిఛార్జి చేయవచ్చు.. కానీ ఐదేళ్ల తర్వాత ఓట్లు వేసేది పోలీసులు కాదు ఈ యువతరం. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన ఏ మాటనూ నిలబెట్టుకోలేదు.ఎన్నికలు వచ్చిన సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చి ఓట్లడుగుతారు, ఇతర సమయాలలో కనిపించరు. అధికారం ఉందని, పోలీసులను నమ్ముకుని యువతను దూరం చేసుకుంటే అధోగతి పాలవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. చిన్న చిన్న ఉద్యోగులు పైసా పైసా కూడబెట్టి స్థలాలు కొనుక్కుని ఇళ్లు కట్టుకుంటే 35 సంవత్సరాల తర్వాత వారి ఇళ్లు కూల్చివేయడం దారుణం.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళ్లు కట్టిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు వారి ఇళ్లను అధికార మదంతో కూల్చివేస్తున్నాడు.ప్రజలకు మేలు చేసే పనులు చేస్తేనే ప్రజలు హర్షిస్తారు. అంతేకానీ పైన ఉన్న బాస్ ల మెప్పు కోసం పని చేస్తే ప్రజలు పాతరేస్తారు. భారతీయ యువ మోర్చా 35 లక్షల మంది నిరుద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటుంది. నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలి.గ్రూప్ 2,3పోస్టులను పెంచాలని డిమాండ్ చేస్తున్న. కేసులు లాఠీలు మా పోరాటం ఆపలేవు..




# క్రీడలను ప్రోత్సహించండి -కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు.

కూకట్ పల్లి ప్రతినిధి జనసముద్రం (జూలై:20) కూకట్ పల్లి కె పి హెచ్ బి డివిజన్ 3వ ఫేస్ లోని సీనియర్ సిటిజన్ భవనం లో మేడ్చల్ మల్కాజ్గిరి క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించు పోటీలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఎంతో మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తల్లితండ్రులు కూడా పిల్లలకు క్రీడల పట్ల అవగాహన పెంచి వారిని ప్రోత్సహిస్తే మంచి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు .అంతేకాకుండా క్రీడలు పిల్లల చదువుకి ఏకాగ్రత ,వారి మానసిక ధైర్యాన్ని పెంచడానికి ప్రోత్సహిస్తాయని అన్నారు.



# కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన సీఐ విష్ణువర్ధన్ రెడ్డి ఎస్సై కురుమూర్తి

వెల్దండ,జూలై,21(జనసముద్రం న్యూస్)ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సిఐ విష్ణువర్ధన్ రెడ్డి మరియు ఎస్సై కురుమూర్తి సందర్శించారు అనంతరం సీఐ విష్ణు వర్ధన్ రెడ్డి మరియు ఎస్సై కురుమూర్తి,మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిభిరం సేవలు అభినందనీయం అని అన్నారు,అలాగే ఈనెల 27వ తేది వరకు ఈ కంటి వైద్య శిభిరం కొనసాగుతుంది అని,ప్రాంత ప్రజలు అందరు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని,ఐక్యత ఫౌండేషన్ సేవలు ఇంకా ముందు ముందు మరిన్ని గొప్ప కార్యక్రమాలతో ముందుకు సాగాలని అన్నారు,ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేందర్ గౌడ్,మల్లయ్య,రమేష్ నాయక్, కొండల్, యూసుఫ్, గణేష్, హస్సన్, రఘు,( శీపతి, శేఖర్, శ్రీను, కళ్యాణ్,మహేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గం లో రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యవర్గ సమావేశం ఏర్పాటుబిబి బిబి చేవెళ్ల పార్లమెంటు పరిధిలో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా కొండ విశ్వేశ్వర్ రెడ్డి కృతజ్ఞత సభ



కూకట్ పల్లి ప్రతినిధి జనసముద్రం (జూలై:20)ఈ కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి, పలువురి సభ్యుల చేత ఆమోదించడం జరిగిందిబూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి...జిల్లా అధ్యక్షులు సామా రంగారెడ్డికాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అమలు కాని హామీలపై, స్థానిక సమస్యలపై ప్రజల తరఫున పోరాటం చేద్దాం...బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్ చందానగర్ డివిజన్ క్రిస్టల్ గార్డెన్స్ లో నిర్వహించిన రంగారెడ్డి(అర్బన్) జిల్లా కార్యవర్గ సమావేశం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ కృతజ్ఞత సభలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు సామా రంగారెడ్డి మరియు కంటెస్టెంట్ ఎమ్మెల్యే అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, కో కన్వీనర్ మణి భూషణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్రావు, శ్రీనివాస్ రెడ్డి,భాస్కర్ రెడ్డి ,నరేష్ ,నరేందర్ రెడ్డి , ప్రేమ్ మహేందర్ రెడ్డి , రవీందర్ గౌడ్ , పవన్ సీనియర్ నాయకులు అశోక్ ,ప్రభాకర్ యాదవ్, నాగేశ్వర్ గౌడ్ ,వసంత్ యాదవ్ రామరాజు , బుచ్చిరెడ్డి,అరుణ్, నవతారెడ్డి , వినయ, సి.హెచ్ స్రవంతి, వరలక్ష్మి,గీతా రెడ్డి, పద్మ, వెంకట్, అజిత్, కేశవ్,విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది .ఈ సమావేశంలో ముందుగా భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించి ముఖ్య నాయకుల చేత జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుల వారి సమక్షంలో పలు తీర్మానాలను, ఆమోదించి భారతీయ జనతా పార్టీకి చెందిన సీనియర్ నాయకులతో తీర్మానాలను బలపరిపింపజేసి తరువాత పార్టీ తీసుకోవాల్సిన భవిష్యత్ కార్యాచరణ గురించి కార్యకర్తలను ఉపన్యాసించారు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కృతజ్ఞత సభలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశ ఖ్యాతిని పెంపొందించడానికి మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని వారి శ్రమ,పట్టుదల వలనే ఎన్నో సాధ్యం కాని గొప్ప గొప్ప పనులు సుసాధ్యం అయ్యాయని కొనియాడుతూ నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి ప్రజలకు, నాయకులకు,కార్యకర్తలకు సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాననితెలిపారు, సభను ఉద్దేశించి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ మనము ఈ కార్యవర్గ సమావేశంలో ప్రవేశా ఎట్టిన తీర్మానాలలో ముఖ్యమైనవి 1, రాజకీయ తీర్మానం 2,జిహెచ్ఎంసి సమస్యలపై తీర్మాన 3, ఇందిరమ్మ ఇండ్లపై తీర్మానం 4,రేషన్ కార్డులు, 5,మహిళా తీర్మానం, సంతాప సభలు 6,మండల కార్యవర్గ సమావేశాలు ఎలా జరుపుకోవాలో పలు విషయాలపై చర్చించుకుని ఎప్పటికప్పుడు సమస్యలపై ప్రజా పోరాటం చేస్తామని తెలుపుతూ రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ గెలవాలంటే నాయకుల మధ్య, కార్యకర్తల మధ్య సమన్వయ లోపం లేకుండా ఈర్ష బేదాలకు పోకుండా అందరూ కలిసికట్టుగా పని చేసినట్లయితే నూటికి నూరు శాతం విజయం సాధిస్తామని తెలుపుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి అత్యధిక మెజార్టీ రావడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు, మహిళా మోర్చా యువ మోర్చా డివిజన్లో వారి అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు మొదలగు వారు పాల్గొన్నారు.

# నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం పై అవగాహన సదస్సు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జనసేన పార్టీ



కూకట్ పల్లి ప్రతినిధి జనసముద్రం (జూలై:20)జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు మరియు కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మల్కాజ్గిరి పార్లమెంటరీ, శేర్లింగంపల్లి నియోజకవర్గం మరియు ఐటీ విభాగం నాయకులతో సమావేశం.ప్రేమ కుమార్ ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద జనసేన నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం పై అవగాహన సదస్సు మరియు సభ్యత నమోదు కొరకై కార్యచరణ గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ సభ్యత్వం యొక్క ప్రాముఖ్యత మరియు దాని వల్ల వచ్చే ప్రయోజనాలు వివరించడం జరిగింది. అదేవిధంగా ఈ సభ్యత్వాన్ని తెలంగాణ రాష్ట్ర మొత్తం ఏవిధంగా తీసుకువెళ్లాలి తద్వారా తెలంగాణలో మన జనసేన పార్టీ బలపడుతుంది అని సూచించారు. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక యజ్ఞంలా ముందుకు తీసుకెళ్లి వీలైనంత ఎక్కువ సభ్యత్వాలు చేయాలని సూచించారు. అనంతరం ఐటి కోఆర్డినేటర్ మిరియాల శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఉపయోగించిన అప్లికేషన్ కంటే కొత్తగా రూపొందించిన సభ్యత్వ అప్లికేషన్ బాగా సులభతరమైనది చెప్పారు. అలాగే పార్టీ క్రియాశీల సభ్యత్వం చేసిన ప్రతి ఒక్కరిని కూడా గౌరవిస్తుందని చెప్పారు. అనంతరము జనసేన పార్టీ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి మండలి దయాకర్ , కుత్బుల్లాపూర్ జనసేన పార్టీ ఇంచార్జ్ నందగిరి సతీష్ , శేర్లింగంపల్లి ఇంచార్జ్ డాక్టర్ మాధవరెడ్డి, కాకుమాను లక్ష్మణ్ రావు పార్టీ బలోపేతంకై తమ అభిప్రాయాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ జనసేన నాయకులు కోల్లా శంకర్, కలిగినిటి ప్రసాద్, వేముల మహేష్ , అడబాల షణ్ముఖ , పులగం సుబ్బ , ఆవుల రంగబాబు , నూకల మల్లేశ్వరరావు , పసుపులేటి ప్రసాద్ , వీర మహిళలు హిందూమతి , ద్రాక్షాయిని మరియు జన సైనికులు పాల్గొన్నారు.



# 5 వ రోజు దిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుగ్గిళ్ళ పీరయ్య మాదిగ

జన సముద్రం న్యూస్ రిపోర్టర్ 20 జూలై 2024 శనివారం మహబూబాబాద్ జిల్లా వివిఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎంఎస్పి జిల్లా నాయకులు పోలేపాక ఎల్లయ్య మాదిగ కూతురు త్రివేణి గత వారం లో హార్ట్ ప్రాబ్లం తో మరణించగా ఈ రోజు త్రివేణి 5వ రోజు దిన కార్యక్రమానికి హాజరై పోలెపాక ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి త్రివేణి కి నివాలులు అర్పించిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గూగ్గిళ్ళ పీరయ్య మాదిగ ఈ కార్యక్రమం లో ఎంఎస్పి మహిళా అధ్యక్షురాలు ఎండి రజియా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పొలెపాక ప్రవీణ్ మాదిగ ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షులు మిర్యాల శ్రీను ఎండి పాషా ఎమ్సుప్పి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగపొంగు శ్రీను జిల్లా ప్రచార కార్యదర్శి కంది పాటి భిక్షపతి ఎమ్మెప్పి మహిళా అధికార ప్రతినిది బోడా సుమిత్ర నాయక్ జిల్లా ఉపాధ్యక్షురాలు గుండెల సరిత ముదిరాజ్ కొల్ల చంద్రకళ రాయిండ్ల కృష్ణవేణి ఎమ్మప్పి జిల్లా నాయకులు ఈదురు సైదులు నల్గొండ కిరణ్ తప్పేట్ల సాయి.ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మిడతపెల్లీ యాకయ్య మాదిగ ఇంక తదితరులు పాల్గొన్నారు



# ఎల్కతుర్తి శ్రీ చైతన్య స్కూల్ లో విద్యార్థి కి తీవ్ర గాయాలు

## -పరిమితికి మించి బస్సులో విద్యార్థులను ఎక్కిస్తుండగా ఓ యూకేజీ విద్యార్థి కి ప్రమాదవశాత్తు తెగిపోయిన చెవి

ఎల్కతుర్తిజూలై 20 జనసముద్రం న్యూస్: అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శ్రీ చైతన్య పాఠశాల మరో సారి వార్తల్లో నిలిచింది. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో తరలిస్తుండగా ఓ విద్యార్థి చెవికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే విషయమై తల్లిదండ్రులు యాజమాన్యం తో మాట్లాడితే.. దురుసుగా సమాదానం రావడంతో వారు అయోమయంలో పడిపోయారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ విలేజ్ లోని శ్రీ చైతన్య స్కూల్ లో భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన కొమ్ముల ప్రణయ్ అనే వ్యక్తి తన కూతురు కొమ్ముల భవిష్రశ్రీ ని యూకేజీ లో చేర్పించాడు. ఎప్పటిలాగే స్కూల్ కు వెళ్లిన భవష్రశ్రీ, క్లాసులు పూర్తయిన తర్వాత ఇంటికి తిరిగి వస్తూ వ్యాన్ ఎక్కే క్రమంలో మరో విద్యార్థి బ్యాగ్ తగిలి చెవి పూర్తి గా తెగిపోయింది. గమనించిన స్కూల్ సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చే లోపు తీవ్రంగా రక్తం పోయింది. స్కూల్ లో ఫస్ట్ ఎయిడ్ కిట్టు లేకపోవడం, బస్సులో పిల్లలపై పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. స్కూల్ వ్యాన్ లో ముప్పై మందిని మాత్రమే తరలించాల్సి ఉండగా, డెబ్బై మందిని తరలిస్తున్నట్లు తల్లిదండ్రులు గుర్తించి, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, 'మీకు నచ్చింది చేసుకోండి' అని దురుసుగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. సదరు విద్యార్థినిని 108 అంబులెన్స్ లో హనుమకొండ లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం పై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.




# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిరేచిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

కూకట్ పల్లి ప్రతినిధి జనసముద్రం (జూలై:20)124 డివిజన్ ఆల్విన్ కాలనీ పరిధిలోని నవోదయా కాలనీలో ఇరవై లక్షల రూపయులు నిధులతో నిర్మాణ పనులు జరుగుతున్న సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఏ.ఇ శ్రావణి తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీ రోడ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, యాదగిరి, రాజిరెడ్డి, శివ శంకర్ రావు, మధన్, కిషోర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ రావు, మహేష్, షకీల్ మున్నా, సంతోష్ బిరాదర్, ఖలీమ్, ఉమేష్, బషీర్, అజామ్, వర్క్ ఇస్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ ఎమ్మెల్యే తో ఫోన్ ఇన్ కార్యక్రమం



జన్నారం మండల విలేఖరి జనసముద్రం న్యూస్ జులై 20జన్నారం పట్టణంలో నేలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వెడమ బొజ్జును మంచిర్యాల జిల్లా ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు పోతు విజయశంకర్ కోరారు.శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు .జన్నారం ప్రభుత్వాసుపత్రి నీ అప్డేట్ చేసి గైనకాలజిస్ట్ ను నియమించాలన్నారు. రాత్రి 8 గంటలకు నిర్మల్ నుంచి జన్నారం బస్సు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.



# జన్నారం పట్టణంలో గురు పౌర్ణమి మహోత్సవం

జన్నారం మండలం విలేకరి జన సముద్రం న్యూస్ జులై 20

మంచిర్యాల జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలంలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో స్వస్తి శ్రీ శ్రీ క్రోధినామ సంవత్సర ఆషాడ శుద్ధ పౌర్ణమి ఆదివారం రోజున గురుపాద పూజ మహోత్సవం జరుపబడును తధానంతరం మధ్యాహ్నము దాన సంతర్పణము కలదు కావున తదితర కార్యక్రమాలలో ప్రముఖులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు

## హుజురాబాద్ కేంద్రంలో మెహందీ వేడుకలు



జనసముద్రం న్యూస్ ప్రతినిధి కరీంనగర్ జూలై 20: హుజురాబాద్ పట్టణ కేంద్రంలో విశ్వ ప్రగతి (విపిఎస్)స్కూల్లో మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆషాడ మాసంలో ఆడవారు ఆనందంగా గోరింటాకును తమ అరచేతులకు అలంకరించుకొని అది ఎర్రగా పండితే ఆనంది స్తారు. గోరింటాకు గౌరీదేవి అంశంతో పుట్టింది కాబట్టి దీనికి గోరింటాకు అనే పేరు.ఇది ఆరో గ్యానికి మంచిది కూడా.ఈ కార్యక్రమాన్ని పుర స్కరిం చుకొని విశ్వ ప్రగతి (విపి ఎస్)స్కూల్లో విద్యార్థ్ధినీ విద్యార్థుల పట్ల ఇలాంటి కార్యక్రమాల వలన సృజనాత్మకతను మరియు సాంస్కృతిక మూ లాలను ప్రోత్సహించడానికి నిర్వహించబడుతుంది అని విశ్వ ప్రగతి డైరెక్టర్ విజయపాల్ రెడ్డి అన్నారు. ఈ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు సంస్కృతి కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ఎన్నో రకాల గోరింటాకు డిజైన్ లు వేసుకొని మురిసిపోయారు.



## ఆదివారం కడెం ప్రాజెక్టు నీటి విడుదల

జన్నారం మండల విలేకరి జనసముద్రం న్యూస్ జులై 20కడెం ప్రాజెక్టు నుండిసాగునీటిని ఎమ్మెల్యే బొజ్జు విడుదలచేయనున్నారని కడెం ప్రాజెక్టు కార్య నిర్వహణ అధికారి రాథోడ్ విట్టల్ తెలిపారు .ఆదివారం ఉదయం 10 గంటలకు కడం ప్రాజెక్టు నుండి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు సాగునీటిని విడుదల చేస్తారని ఆయన తెలిపారు. వానాకాలం సీజన్ కు సీజన్ కు సంబంధించి కడెం ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలకు సాగునీటి విడుదల చేస్తారని తెలిపారు.కడెం ప్రాజెక్టు పరిసరాలలో పశుకాపర్లు ప్రజలు వెళ్ళనీయకుండా చూడాలని ఆయన కోరారు ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించి సహకరించాలని కోరారు



## 31వ వార్డు ఆజాద్ నగర్ లో నివసిస్తున్న ప్రజల సమస్యలు పరిశీలించిన టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జనసముద్రంన్యూస్, జులై 20, పల్నాడు జిల్లా, మాచర్ల. మాచర్ల నియోజకవర్గ శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మాచర్ల పట్టణ ప్రధాన కార్యాదర్శి బండ్ల శ్రీనివాసరావు, మాచర్ల పట్టణ బిజెపి అధ్యక్షులు ఓర్సు క్రాంతి కుమార్, ఎస్కే నాగూర్ బాషా, కంభంపాటి దానం బాబు శనివారం 31వ వార్డు ఆజాద్ నగర్ లో పర్యటించి అక్కడి సమస్యలు పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా ఆ వార్డు లో డ్రైనేజీ వ్యవస్థ (మురికి కాలువలు) అస్తవ్యస్తంగా తయారైందని, వాటి వలన అక్కడ నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని, మరియు గ అక్కడున్న గవర్నమెంట్ పాఠశాలను కూడా పరిశీలించి చదువుకుంటున్న ప్రతి స్టూడెంట్ కి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని, ఈ విషయాన్నీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వద్దకు తీసుకొని వెళ్లి ఆ వార్డులో నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని చెప్పారు.




## సానిపాయ పరిధిలో... 8ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరి అరెస్టు

### మరి కొంతమంది కూడా చెమ్మ చీకట్లో కనిపించక పారిపోయారు.

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జులై 20 జన సముద్రం న్యూస్

అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలోని సానిపాయ అటవీ ప్రాంతంలో 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఒకరిని టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచన మేరకు ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ శుక్రవారం స్థానిక అటవీ శాఖ సిబ్బందితో కలసి సానిపాయ బేస్ క్యాంపు నుంచి రాయవరం మీదుగా ఆవుల దారి, సరస్వతి కటువ, ముదుంపాడు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. లోమోర నిషేధిత అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుంటూ వెళు తూ కనిపించారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టగా, వారు దుంగలను పడేసి పారిపోసా గారు. అయితే టాస్క్ ఫోర్సు సిబ్బందిని వారిని వెంబడించి, ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. మిగిలిన వారు చిమ్మ చీకట్లో కలసి పోయారు. పట్టుకున్న వ్యక్తిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయితీకి చెందిన రమేష్ (32)గా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి ఆ ప్రాంతంలో పడి ఉన్న 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో నమోదు చేసిన సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

## అడ్డదిడ్డమైన భారీ వాహనాల పార్కింగ్ తో ఇబ్బందులు పడుతున్న పాదచారులు ద్విచక్ర వాహనాలు

### పట్టించుకోని సంభందిత పోర్ట్ అధికారులు,సెక్యూరిటీ సిబ్బంది




జనసముద్రం న్యూస్,పోర్ట్ ఏరియా,విశాఖపట్నం, జూలై 20,విశాఖ పోర్టు ఏరియా పరిధి లోని కన్వెంట్ జంక్షన్ నుంచి నాల్కో , వోహెచ్సి, వెస్ట్ క్యు,ప్రాంతాలకు వెళ్లే మార్గంలో సేవాజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ,,వద్ద అనకాపల్లి రైల్వే గేట్ అవతల గల మైన్ రోడ్డులో బొగ్గు కార్గో లోడ్ కు వొచ్చే భారీ వాహనాలను (12టైర్,14టైర్,18టైర్)వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిర్లక్ష్యం గా అడ్డదిడ్డంగా నిలుపుదల చేస్తున్నారని అలాగే వాహనాలను పార్కింగ్ చేసేటప్పుడు వెనుకగా వొచ్చే వాహనాలను గమనించకుండా భారీ వాహనాలను వెనుకకు డ్రైవ్ చేస్తూ వుంటారని దీని ఫలితంగా ఈ ప్రాంతంలో ఈ వైపుగా రాకపోకలు సాగించే చాలా మంది కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని చాల మంది కార్మికులు చెబుతున్నారు,, అడ్డదిడ్డంగా వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయడం వలన ముందునుంచి వెనుకనుంచి వొచ్చే వాహనాల బారీ నుంచి తప్పించుకోలేకపోతున్నమని పలువురు కార్మికులు చెబుతు న్నారు, ,ఇప్పటి వరకు ఈప్రాంతంలో పెద్ద ప్రమాదం జరగలేదన్నారు,,ఇదే పరిస్తితి కొనసాగినట్లయితే ప్రాణాంతక ప్రమాదాలు జరిగే అవకాశం వుందని ద్విచక్ర వాహనాలు చెబుతున్నారు,,ఇదే విషయాన్ని ఈ ప్రాంతంలో విధులు నిర్వహించే పోర్ట్ సంభదిత సెక్యూరిటీ సిబ్బంది కీ (సి ఐ యస్ ఎఫ్ సిబ్బంది కీ బదులుగా వీళ్ళు పోర్టు లో కొన్ని ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు)మనవి చేయాగ తమకు ఏమి సంబందం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పలువురు కార్మికులు చెబ్తుతున్నారు,,ఇప్పటి కైన సంభదిత పోర్ట్ అధికారులు స్పందించి అడ్డ దిడ్డంగా పార్కింగ్ చేస్తున్నా భారీ వాహన దారుల తగిన చర్యలు తీసుకోవాలి అని కోరుతున్నారు,,

## 10రోజుల్లో టీడ్కో కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే వేనిగండ్ల రాము



జనసముద్రం న్యూస్ గుడివాడ ప్రతినిధి. జులై.20.కాలనీ సమస్యలపై అధికారులు.... కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో ఎమ్మెల్యే రాము సమావేశంకనీస ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వం చేసిన తప్పుదాలను....సాకులు చెప్పకుండా మనమందరం సరి చేయాలి.....ప్రతి ఇంటికి నేరుగా త్రాగునీరు అందించి తీరాల్సిందే.....కాలనీ ప్రారంభోత్సవానికి... కోటిన్నర మున్సిపల్ జనరల్ ఫండ్స్ వినియోగంపై విచారణ చేపడతాంగుడివాడ పట్టణం మల్లాయపాలెం టీడ్కో కాలనీ నివాసతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గుడివాడ పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక సంఘ,టీడ్కో అధికారులు, మరియు కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఎమ్మెల్యే రాము శనివారం సమావేశమయ్యారు. వారం రోజులుగా కాలనీ నివాసితులు త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న చర్యలు తీసుకోకపోవడంపై ఎమ్మెల్యే రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ శాఖలు మరియు కాంట్రాక్ట్ సంస్థలు పొంతన లేని సమాధానం చెప్పడంతో ఎమ్మెల్యే రాము మండిపడ్డారు. గత ప్రభుత్వ తప్పిదాలపై తాను వివరణ కోరడం లేదని..... ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సమావేశంలో స్పష్టం చేశారు. టీడ్కో కాలనీలో ప్రధాన నిర్మాణాలను క్వాలిటీ కంట్రోల్ నిపుణులతో పరీక్షలు చేయించాలని అధికారులను ఎమ్మెల్యే రాము ఆదేశించారు. కాలనీలో భవనాలు మరియు అభివృద్ధి పనులు, త్రాగునీటి ప్రాజెక్టుల మరమ్మత్తులన్నింటిని కాంట్రాక్టు సంస్థలు పూర్తిచేసి..... పది రోజుల్లో పురపాలక సంఘానికి అప్పగించి తీరాలని సమావేశంలో ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ చేతకానితనం, అవినీతిని ఎత్తి చూపే కంటే..... ప్రజల సమస్యల పరిష్కారమే తమ అంతిమ లక్ష్యమన్నారు. సరైన ప్రణాళిక లేకుండా, కనీస మౌలిక వసతులను పూర్తి చెయ్యకుండా, ప్రచార ఆర్భాటం కోసం గత ప్రభుత్వం....టీడ్కో కాలనీను ప్రారంభోత్సవం చేయడంతో.... సమస్యల లోతు ఎంత ఉందో అధికారులకు కూడా తెలియడం లేదని.... వారి నిర్లక్ష్యం కారణంగా నేడు ప్రజలు కష్టపడాల్సి వస్తుందని ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల చిన్నపాటి సమస్యలు పరిష్కరించకుండా.... కేవలం కాలనీ ప్రారంభోత్సవానికి గత ప్రభుత్వ పెద్దలు కోటిన్నర పురపాలక సంఘ జనరల్ ఫండ్స్ వినియోగించడాన్ని ఎమ్మెల్యే రాము తప్పుబట్టారు.... ఈ వ్యవహారంపై విచారణ చేయిస్తామని ఆయన అన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ,మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, ప్రవీణ్, టిడ్కో బి. చిన్నోడు, డిఇ శాంత కుమార్ సురేష్ బాబు , కాంట్రాక్టు సంస్థలైన కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాము పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

### మెగా రక్తదాన శిబిరం నిర్వహించిన అభిమానులు

### ఆస్పత్రిలో పేషెంట్లకు పండ్లు,రొట్టెలు పంపిణీ...



గోకవరం జన సముద్రం న్యూస్ జూలై 20 గోకవరం మండల టిడిపి కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకొని ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక డా. రాజబాబు నర్సింగ్ హోమ్ వద్ద శనివారం నాడు రాజమండ్రి సంజీవని బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో సుమారు 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నందు టిడిపి నాయకులు పేషెంట్లకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం జరిగింది. మండల టిడిపి,బీజేపీ, జనసేన నాయకులు రామును సాలువాలతో సత్కరించి,బొకేలు అందజేసి,భారీ కేకులు కట్ చేసి ఆనందంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై అభిమానంతో పదిమందికి ఉపయోగపడే విధంగా రక్తదానం నిర్వహించిన తన టిడిపి కుటుంబ సభ్యులందరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని, ప్రత్యక్షంగాను మరియు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ తన యొక్క ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాము అంటే మాకు ఎంతో అభిమానమని ఆయన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం,రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం మాకు ఎంతో గర్వంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## జలకళ తో పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్న ఎత్తిపోతల జలపాతం

జనసముద్రంన్యూస్, జులై 20, పల్నాడు జిల్లా, మాచర్ల మండలం.మండలంలోని తాళ్ళపల్లి సమీపంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు వరద ప్రవాహం పెరిగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎత్తిపోతల జలకళ ను సంతరించుకుంది.ఎగువన వర్షాలు భారీగా పడుతుండటంతో వాగులు,అటవీ మార్గాల ద్వారా వరద నీరు ఎత్తిపోతలకు చేరుకుంటుంది. ఎత్తిపోతల 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు ప్రవహిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ జలపాత అందాలను చూసేందుకు సందర్శకులు ఎత్తిపోతలకు చేరుకుంటున్నారు.




## వరద బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మొడియం.శ్రీనివాస్

జనసముద్రం న్యూస్ జూలై 20,

ఏలూరు జిల్లా, పోలవరం నియోజకవర్గం, వేలేరుపాడు మండలం లో పెద్ద వాగు కట్ట తెగడం తో వరద ముంపుకు గురైన గ్రామాలు,గత మూడు రోజులగా భారీగా కురుస్తున్న వర్షానికి అతలాకుతలమైన వేలేరుపాడు మండల ప్రజల పరిస్థితుల దృష్ట్యా పర్యటించిన పోలవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మొడియం.శ్రీనివాస్,పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కలిసి ప్రజల పరిస్థితులను తెలుసుకుంటూ పర్యటించారు, ప్రభుత్వం ఎప్పుడు మీకు తోడు గా ఉంటుంది, అని వరద బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన-తెలుగుదేశం-బిజెపి పార్టీ, నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అనంతరాజుపేట1 సచివాలయం సిబ్బందికి పొంచి ఉన్న ప్రమాదం

### చెప్పుకోవడానికి మేజర్ పంచాయితీ...! స్టాఫ్ కూడా కుర్చలేని గది ఉన్న సచివాలయం..!

### సచివాలయంలో స్టాఫ్ కూడా అందరూ ఆడవారే...! అది గమనించిన స్లాబు పైనుంచి చిన్న చిన్న ముక్కలు వేస్తున్నది..

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జూలై 20 జనసముద్రం న్యూస్

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలో మేజర్ పంచాయితీ అయినటువంటి అనంతరాజుపేట పంచాయతీలో సచివాలయం1 లొ పై స్లాబ్ బెచ్చులు వూడి అప్పుడప్పుడు పని చేస్తున్నా వర్కర్ల మీద పడుతున్నాయని చెప్పుకొచ్చారు. దాదాపుగా ఒకటో నెంబర్ సచివాలయానికి 3,000 ఓట్లు కలిగి.. జనాభాలో నాలుగు వేలకు పైబడి ఉన్నా.. దాదాపుగా 1000 పైన ఉన్న ఇండ్లు గ్రామానికి సరైన సచివాలయం లేక ఇబ్బంది పడుతున్నారు.. ముందున్న ఎమ్మెల్యే మాత్రం ఒక్క అనంతరాజుపేట పంచాయతీకి దాదాపుగా 86 కోట్లు ఖర్చు పెట్టాను అని చెప్పకు వస్తున్నాడు ఆ డబ్బులు అన్ని అనంతరాజుపేట 20 ఏళ్ల నుంచి ఏక చక్రాధిపతిగా పాలిస్తున్న అయ్యోరు మరియు వాళ్ళ అనుచరులు జోబుల్లోకి పోయాయా అంటూ గ్రామ ప్రజలు చెప్పుకొచ్చారు. ఈ పంచాయతీ మీద అన్నమయ్య జిల్లా కలెక్టర్ వారు 2019 నుండి 2024 వరకు ఏమేమి ఖర్చు చేశారో ఎంక్వైరీ వెయవలసిందిగా గ్రామ ప్రజలు. వార్డ్ నెంబర్లు. ముక్కంఠంతో చెప్పడం జరుగుతున్నది...

జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
ఆదివారం 21,జూలై,2024

## చంద్రబాబు, జ్యోతుల నెహ్రూ విజయం తో షిరిడి సాయి బాబాకు మొక్కులు చెల్లించుకున్న నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట సత్యవతి


గోకవరం జనసముద్రం న్యూస్ జూలై 20
సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా జ్యోతుల నెహ్రూ ఎమ్మెల్యేగా విజయం సాధించాలని జగ్గంపేట నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు గుమ్మల్ల దొడ్డి ఎంపీటీసీ సభ్యురాలు కోట సత్యవతి, గుమ్మడిదొడ్డి గ్రామ టిడిపి ఉపాధ్యక్షులు కోట సూరిబాబుదంపతులుషిరిడిసాయిబాబా మొక్కుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అఖండ విజయం సాధించడం జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ చరిత్రలో కనివిని ఎరుగని మెజార్టీతో విజయం సాధించడంతో షిరిడి వెళ్లి సాయిబాబా వారి దర్శనం చేసుకుని బాబా వారి పాదాల వద్ద ఉంచిన ప్రత్యేక కండువాను బాబా వారి చిత్రపటాన్ని శనివారం జగంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ చైర్మన్ జ్యోతుల మణి దంపతులను బాబా



వారి కండువాతో సత్కరించి సాయిబాబా వారి చిత్రపటం బహుకరించారు.

## మున్సిపల్ కమిషనర్ షాపులు పై చూపించిన జులుం ని ఖండించిన సీపిఐ పార్టీ





జనసముద్రంన్యూస్, జులై 20,
పల్నాడు జిల్లా, నర్సరావుపేట.
మున్సిపల్ కమిషనర్ హఠాత్తుగా పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి కాంప్లెక్స్ లోని షాపులను పడగొట్టారు అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తీవ్రంగా ఈ చర్య ని ఖండించారు. ఇప్పటికైనా బ్రహ్మానంద రెడ్డి కాంప్లెక్స్ ను ఆక్రమించుకున్నటువంటి ఆక్రమణదారులు పైన చర్యలు తీసుకోవాలని ,నిరుపేదలైన కూరగాయలు అమ్ముకొని జీవిస్తున్న చిన్న చిరు వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేయటం ఏ మాత్రం భావ్యం కాదని ఆయన అన్నారు.వ తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని లేని పక్షాన సిపిఐ పక్ష ధర్నా నిర్వహిస్తామని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సిపిఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, బాధితులు రామిశెట్టి శంకర్, అనిల్, చింత శ్రీనివాసరావు, సుబ్బారావు,సాంబయ్య ,శివ, కోటేశ్వరరావు, సుబ్బయ్య, అన్నమయ్య, జేవియర్ తదితరులు పాల్గొన్నారు .

## ప్రభుత్వం హాస్పిటలలో తనిఖీ చేసినఎమ్మెల్యే శ్రీ చిర్రి రాజు

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ప్రతినిధి జూలై 20
కొయ్యలగూడెం మండల కేంద్రం లో గవర్నమెంట్ హాస్పిటల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే శ్రీ చిర్రి బాలరాజు ఆకస్మిక తనిఖీ తో కంగుతిన్న వైద్య సిబ్బంది... రికార్డ్స్.. పరిసరాలను, ల్యాబ్ లను, మెడికల్ కిట్స్ ను పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చాలా ఇరెస్పాన్సిబిల్ గా ఉన్నారు, ఒపీ రికార్డ్స్ సరిగా లేవు, ప్రాథమిక చికిత్స కూడా సరిగా లేవు... మరొకసారి ఇది పినరావృతం ఐతే మీరు అంత ఇంటికే పరిమితం అవుతారు జాగ్రత్త అని హెచ్చరించారు. పైఉన్నత వైద్య అధికారికి ఫోన్లో మాట్లాడి దీనిపై యాక్షన్ తీసుకోకపోతే నేను రంగంలో దిగాల్సి



ఉంటుంది అని హెచ్చరించారు ఈ తనిఖీ లో జనసేన మండల అధ్యక్షులు తోట రవి టౌన్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## వర్షం మీరుతో నిండిపోయిన బీసీ కాలనీ



బోనకల్, మధిర నియోజకవర్గం,
ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్, (జూలై 20):
గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలో ని ఆలపాడు బీసీ కాలనీ వర్షపు నీటితో నిండిపోయిన మలాది అచ్చయ్య గృహం, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సైడ్ కాలువలు లేక నివాస స్థలాలలో నీరు నిల్వ ఉండటం వలన దోమల బెడద ఎక్కువ అయింది. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందిన పడుతున్నారు. తాసిల్దార్, ఎంపీడీవో ఆర్ఐ, ఎంపీఓ విచ్చేసి ఇక్కడ ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడం జరిగినది. బీసీ కాలనీకి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జంపాల రవి, యువ కాలసాని పరశురాములు, గ్రామపంచాయతీ సెక్రటరీ పరశురాం, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు అర్వపల్లి తిరుపతి, పర్స గాని పిచ్చయ్య, మరియు బీసీ కాలనీవాసులు పాల్గొనడం జరిగినది.

## జూరాల ప్రాజెక్టును పరిశీలించి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

జనసముద్రం న్యూస్ వనపర్తి జులై 21:
జూరాల ప్రాజెక్టును సందర్శించి పరిశీలించిన వనపర్తి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ నది పరివాహక లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గంగ్వార్ ఆదేశించారు, ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రిజిస్టర్ లను పరిశీలించారు, చికిత్స పొందుతున్న పేషంట్లను హృప్యాయంగా పలకరించారు. వైద్యులతో మాట్లాడారు. సీజన్ వ్యాధుల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యార్థులు పాటలు చదివి వినిపించారు. అమరచింత మండలం నందిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని సంపద వానలు ఉపాధి హామీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ సంచత్ గంగ్వార్. ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు తాగునీరు వసతి, వంటగది, మరుగుదొడ్లు, సహా అన్ని పక్కగా ఉండేలా మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిఈ, డిఆర్'డిఓ, తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.




## ఐ లవ్ గుడివాడ" ప్రభుత్వంతో ప్రజల భాగస్వామ్యం.... అవుతుంది గుడివాడ అభివృద్ధిమయం:ఎమ్మెల్యే వేనిగండ్ల రాము

జనసముద్రం న్యూస్ గుడివాడ ప్రతినిధి. జులై.20.
ఉత్తమపౌరులుగా మనమందరం...మంచి గుడివాడ కోసం కృషి చెద్దాం...ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. పరిశుభ్రమైన గుడివాడరూపకల్పనలోప్రభుత్వం చేస్తున్న కృషిలో.... .ప్రజలు కూడా భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే రాము చెయ్యి చెయ్యి కలిపి రాబోవు 5ఏళ్లలో కొత్త గుడివాడను రూపొందించుకుందాం మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి 'క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడపై' అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే రాము. ర్యాలీలో ఐ లవ్ గుడివాడ ప్లకార్డులు పట్టుకొని పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఎన్డీఏ పార్టీల నేతలు, యువత. పరిసరాల పరిశుభ్రతపై రోడ్ల వెంబడి టీ స్టాల్స్, తోపుడు బళ్ళు, వ్యాపార దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే రాము. శానిటేషన్ సిబ్బందితో కలిసి చెత్త సేకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము.

**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కామెంట్స్**

ఎంతో పేరుగాంచిన గుడివాడను.... పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత.
ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించేలా.... ఐ లవ్ గుడివాడ ప్రాజెక్ట్ ను ప్రారంభించాం.
మన ఇంటితో పాటు....మన పరిసరాలకు కూడా ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
పురపాలక సంఘ వాహనాల ద్వారా ప్రతిరోజు



చెత్తను సేకరిస్తున్న.....
అవగాహన లేమీతో రోడ్లపై చెత్త వేయడం ప్రజలకు అలవాటుగా మారింది.
ఎక్కడపడితే అక్కడ చెత్త వెయ్యడంతో రోడ్లన్నీ అపరిశుభ్రంగా మారాయి.
ఎంతో పేరుగాంచిన గుడివాడ ఖ్యాతిని మరింత పెంపొందించుకునేలా.....ప్రజలందరూచైతన్యవంతులు కావాలి.
ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో మాజీ మినిస్టర్ పిన్నమనేని వెంకటేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే రావి




వెంకటేశ్వరరావు,మున్సిపల్కమిషనర్బాలసుబ్రమణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు దారం నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడాలిరామరాజు, పలువురు మున్సిపల్ అధికారులు ఎన్డీఏ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సనత్ నగర్ ఇన్స్పెక్టర్ పురెందర్ రెడ్డి సస్పెండ్




కూకట్ పల్లి ప్రతినిధి
జనసముద్రం న్యూస్ జూలై 20:
సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సైబరాబాద్ సిపి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన మహిళ పట్ల అసభ్య చాటింగ్ సైబరబాద్ సిపిను ఆశ్రయించిన బాధితురాలు సిఐచేసినచాటింగ్సీపికిచూపించిన బాధితురాలు అందంగా ఉన్నావు, చెప్పిన ప్లేస్ కి రావాలి అంటూ సిఐ మేసేజిలు

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లయన్స్ మిత్ర నూతనం అధ్యక్షుని కూరెళ్ళ కృష్ణ చారి కి ఘన సన్మానం

జనసముద్రం న్యూస్
దేవరకొండ మండలం
నల్గొండ( జిల్లా)జులై :20
దేవరకొండ పట్టణంలో లయన్స్ మిత్ర అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కూరెళ్ళ కృష్ణ చారి ని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో



ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి మిఠాయి తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... కూరెళ్ళ కృష్ణ చారి గతం 15 సంవత్సరాల నుండి బీసీ బహుజన సామాజిక ఉద్యమాలలో పోరాటం చేసి ఇంటర్నేషనల్ లయన్స్ మిత్ర గ్రూప్ లో గత రెండు సంవత్సరాలుగా పని చేసినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. అతను సేవలను గుర్తించి జాతీయస్థాయిలో సేవారత్నం అవార్డులు అందించారు. ఇదేవిధంగా ముందు ముందు ప్రజాసేవలో, సామాజిక సేవలో, బీసీ ఉద్యమంలో పాల్గొంటూ అనే రకములైనటువంటి పదవులను పొందుతూ సమాజానికి, సంఘ శ్రేయస్సుకు తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చోల్లేటి భాస్కరాచారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు అంకం చంద్రమౌళి, రాసమల్ల నాగయ్య ముదిరాజ్, చేరుపల్లి జయలక్ష్మి, ముసిని సత్యం,గౌరోజు బ్రహ్మాచారి,వనం శ్రీను,ఇరగదిండ్ల కృష్ణ, కొర్ర కిషన్ నాయక్, సయ్యద్ అజ్మతుల్ల ,మోతిలాల్,శ్రీనివాస్ రెడ్డి,వెంకట,పాండు తదితరులు పాల్గొన్నారు.

## దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు కోరారు.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ జూలై 20
దాశరథి శత జయంతి ఉత్సవాల ప్రారంభసభను ఈనెల 22న మహబూబాబాద్ లో నిర్వహిస్తున్న సందర్భంగా ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 22న దాశరథి స్వగ్రామమైన చిన్నగూడూరు మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చిన్నగూడూరు నుండి మహబూబాబాద్ వరకు బైక్ ర్యాలీ అనంతరం మహబూబాబాద్ లో ప్రారంభసభ నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కవులు హాజరవుతారని తెలిపారు.
ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి బానోత్ రవికుమార్ , గునిగంటి కమలాకర్ జెర్రిపోతుల వెంకన్న మంగళంపెల్లి కన్నా , వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్ డౌలాగర్ శంకర్ అంబాల శివకుమార్ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోటివేషన్ ఇండియా మరియు సుధాకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ





యాదాద్రి భువనగిరి జిల్లా జులై.20,
భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:
జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండలం నెమరగోముల(బాగ్దాయర) వీఎల్ఎన్ ఫంక్షన్ హాల్ లో శనివారం రోజున మోటివేషన్ ఇండియా మరియు సుధాకర్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో బీబీనగర్మండలంలోని వివిధగ్రామాలకు చెందిన వికలాంగులకు 25 ట్రై సైకిలను పంపిణీ చేయడం జరిగినది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహాదేవపూర్ బ్రహ్మకుమారిస్ ప్రతినిధి సునీతదీదీ.అదేవిధంగాఈ కార్యక్రమంలో మోటివేషన్ ఇండియా ప్రతినిధులు సుధాకర్,ప్రశాంత్,విష్ణు,నందిని,శేఖర్,వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు,మాజీ వైస్ ఎంపిపి కొంతం లింగయ్య,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురకంటి సుధాకర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి ఎరుకల బాలకృష్ణగౌడ్,మాజీసర్పంచ్కుమార్,పంజాలసతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డీజేఎఫ్ నూతన నియామకాలు

**డీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మోటపలుకుల**
**రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా కోల**
**ఉత్తర తెలంగాణ ఇంచార్జ్ గా పార్వతి**



జనసముద్రం న్యూస్ జూలై 20
( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )
డీజేఎఫ్ జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి తెలంగాణలో డీజేఎఫ్ బలోపేతం దృష్ట్యా రాష్ట్ర అధ్యక్షుడిగా మోట పలుకుల వెంకట్ ను అలాగే మంచిర్యాల జిల్లాకు చెందిన కోల శ్రీనివాస్ ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా , ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీగా. పార్వతి రాజిరెడ్డిని నియమించడం జరిగింది. ఇట్టి నియామకంపై వీరు జాతీయ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డీజేఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామని త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు.

## నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్, ఎంఆర్ఐ ఆధునిక వైద్య పరీక్షా కేంద్రాలను ఏర్పాటు



కూకట్ పల్లి ప్రతినిధి
జనసముద్రం న్యూస్ జూలై 20
తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్, ఎంఆర్ఐ ఆధునిక వైద్య పరీక్షా కేంద్రాలతోపాటుఫిజియోథెరఫీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. చికిత్స కోసం వచ్చినఆర్టీసీసిబ్బందితోఆయనముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో టీజీఎస్ఆర్టీసీ ఎండీవీసీసజ్జనర్, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తార్నక ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు.సిబ్బందికిఅందిస్తోన్న వైద్య సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అంతకముందు ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కను నాటారు.


# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- గామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలి
- అధికారులు హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి
జనసముద్రం న్యూస్ జూలై 20

శనివారం సాయంత్రం కలెక్టరేట్ మొదటి అంతస్తు లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్స్, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు, ఇరిగేషన్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయితీ రాజ్, సంబధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు,





ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచనలమేరకుఅధికార యంత్రాంగం అప్రమత్తమై సిద్ధంగా ఉండాలని ఎలాంటి పరిస్థితులు ఐనా ఎదురుకొనేందుకుముందస్తుజాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు, గ్రామాలు,పట్టణాల్లో పాత భవనాలు ఉంటే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు, వాగులు, వల్ల ప్రవాహం, చెరువుల వద్ద నీటి మట్టం ఎప్పటికపుడు గమనిస్తూ ఉండాలనీ కలెక్టర్ సూచించారు, ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ బృందంలో రెవెన్యూ, పోలీస్, పంచాయితీ, మున్సిపల్ సిబ్బంది ఉంటారు ఏదైనా సమస్యలు ఉంటే వారు వెంటనే వెళ్ళి పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు,భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఆస్తి, జంతు, ప్రాణ నష్టాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు, జిల్లాలో ఉన్న ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దేవిడ్, మహబూబాబాద్ ఆర్డిఓ అలివేలు, జడ్పీ సీఈఓనర్మద, డిపిఓ హరిప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి భాయి, వెల్ఫేర్ ఆఫీసర్స్ కలెక్టరేట్ ఏఓ వేంకట రమణ, సుపర్డెంట్స్ పవన్ కుమార్, భద్రకాళీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దర్స్ ,ఎంపీడిఓస్ తదితరులు పాల్గొన్నారు.

# రాయల చంద్రశేఖర్ సంతాప సభలను నిర్వహించండి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి
జనసముద్రం న్యూస్ జూలై 20

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్(ప్రజాపంద) కేంద్ర కంట్రోలింగ్ కమిషన్ చైర్మన్,సంయుక్త కిసాన్ మోర్చా( ఎస్కేయం )జాతీయ కన్వీనర్ రాయల చంద్రశేఖర్ సంతాప సభలను ఈ నెల 25 వరకు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్)ప్రజాపంద మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. నేడు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. రాయల చంద్రశేఖర్ జూలై 16న రైలు ప్రమాదంలో మరణించారని ఆయనను స్మరిస్తూ ఈనెల 25 వరకు గ్రామ గ్రామాన సంతాప సభలు, జులై 28న ఖమ్మంలో జరుగు రాష్ట్రస్థాయి సంతాప సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాయల చంద్రశేఖర్ చిన్నతనం నుండే విప్లవోద్యమంలో దూకి విద్యార్థి దశలో విద్యారంగ సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించాలని ఆనాడు జరిగిన విద్యార్థి ఎన్నికలలో వరుసగా ఎన్నికైన అని అన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో రహస్య జీవితాన్ని గడుపుతూ పశ్చిమగోదావరి ఖమ్మం ఉమ్మడి వరంగల్ జిల్లా అడవులలోఆదివాసీ, ఇతర పేదల్లో పనిచేశాడని ఆ సందర్భంలో అనేక దాడులను నిర్బంధాలను



ధైర్యంగా ఎదుర్కొన్నాడని అన్నారు. ఇల్లందు విప్లవద్యమంలో, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తన నివాసాన్ని ఏర్పాటు చేసుకొని ఆదివాసీలు, గిరిజనులు, దళితులు,బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడే వాడని గుర్తు చేసుకున్నారు. పోడు భూములకు పట్టాల కోసం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం, పెంకు ఫ్యాక్టరీ కార్మికుల వేతనాల పెంపు కోసం,తునికాకు రేట్లు, వ్యవసాయ కూలీల రోజు కూలి పెంపు తదితర ఎన్నో పోరాటాలలో ముఖ్యమైన భూమిక పోషించాడని అన్నారు.కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన రైతు నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని, కార్మికులను కట్టు బానిసలుగా మార్చటానికి నూతన లేబర్ కోళ్లు తీసుకొచ్చిందని, ఇంటికో ఉద్యోగం హామీ మరిచిందని ప్రజలంతా పోరాటాలకు సిద్ధమవుతుంటే నాయకత్వం వహించే అపార అనుభవం ఉన్న రాయల చంద్రశేఖర్ లేకపోవడం తీరని లోటు అన్నారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా( ఎస్.కె.ఎం) ఆధ్వర్యంలో జరుగుతున్న దీర్ఘకాలిక ఐక్య ఉద్యమాలకు జాతీయస్థాయిలో కన్వీనర్ గా పనిచేసిన చంద్రశేఖర్ ఆ ఉద్యమాలలో ఆయన లేని వెలితి నేడు కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల లోపు రుణమాఫీ హామీని అనేక కోరీలతో అమలు చేయకుండా కుట్రలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల హామీలు అమలులో పూర్తిగా విఫలమైందని పార్టీ ఫిరాయింపులకు ఇస్తున్న ప్రాధాన్యత ప్రజా సమస్యల పరిష్కారానికి ఇవ్వడం లేదని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంద జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ముంజంపల్లి వీరన్న, బిల్లా కంటి సూర్యం తదితరులు ప్రసంగించారు..

# ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ జూలై 20
ప్రాథమికోన్నత పాఠశాల వేమునూర్ లో పనిచేస్తూ పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులలో భాగంగా వేమునూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బానోత్ భాగ్య స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందారు. వీరితోపాటు రాచకొండ ఉపేందర్, కోడెం శ్రీనివాస్, ఎదునూరి అశోక్, దారావత్ వీరన్న, జి మంజుల, జి శ్రీలత బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీకటి ఉపేందర్ అధ్యక్షతన వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు చీకటి ఉపేందర్ మాట్లాడుతూ పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో చాలాకాలం పనిచేసి విద్యార్థులకు సేవలందించారని అన్నారు. అంకితభావంతో పనిచేసి విద్యార్థుల, పాఠశాల ప్రగతికి కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు వేరే పాఠశాలలకు వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ ఉద్యోగ నిర్వహణలో ఈ తప్పదని అన్నారు వారు వెళ్ళిన పాఠశాలలో కష్టపడి పని చేస్తూ ఆయా పాఠశాలల అభివృద్ధికి చేయాలని కోరారు

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ కుమార్, సిహెచ్ స్వామినాథ బాబు, సజ్జనము వెంకటేశ్వర్లు, భోజన్, నాయిని సుధాకర్, ప్రసాద్ విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

H.O. Mobile : 9494184136
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

# తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం



చౌటుప్పల్ జనసముద్రం జూలై 20 :చౌటుప్పల పట్టణ కేంద్రంలోని బంగారుగడ్డ తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల&కళాశాలలో 75,వ వన మహోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు గారు పాల్గొన్నారు వారి చేతుల మీదుగా మొక్కలు నాటడం జరిగింది.ఇంటింట మొక్కలు పెంచుదాం..ఊరంతా పచ్చదనం నింపుదాము అనే నినాదంతో విద్యార్థులతో కలిసి ర్యాలిగా వెళ్ళారు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్,వెంకటేశ్వర నాయక్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, కౌన్సిలర్ ఎండీ బాబా షరీఫ్,బండమీది మల్లేష్, కొయ్యాడ సైదులు, ఉబ్బు వెంకటయ్య, తాడూరి పరమేష్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, అంతటి బాలరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి సరోజినీ, ఎస్ఎంసి చైర్మన్ చింతల సాయిలు మరియు పాఠశాల, కళాశాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## తీగల బిక్షమయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన చిలువేరు సమ్మయ్య గౌడ్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి
జనసముద్రం న్యూస్ జూలై 20

కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి గ్రామానికి చెందిన తీగల శ్రీనివాస్ తండ్రి బిక్షమయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలిసిన వెంటనే వివో ఏ గా పని చేస్తున్న తీగల సునీత శ్రీనివాస్ లను, శ్రీనివాస్ తమ్ముళ్లు అయినా వెంకన్న యాకన్నలను అదేవిధంగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి బిక్షమయ్య గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్...

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎర్రంశెట్టి అశోక్,గోపాల శ్రీనివాస్ రెడ్డి, గండి వీరేందర్ గౌడ్, కొండేటి కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ ఎమ్మెల్యే తో ఫోన్ ఇన్ కార్యక్రమం

జన్నారం మండల విలేఖరి
జనసముద్రం న్యూస్ జులై 20



జన్నారం పట్టణంలో నేలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వెడమ బొజ్జును మంచిర్యాల జిల్లా ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు పోతు విజయశంకర్ కోరారు.శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు .జన్నారం ప్రభుత్వాసుపత్రి నీ అప్డేట్ చేసి గైనకాలజిస్ట్ ను నియమించాలన్నారు. రాత్రి 8 గంటలకు నిర్మల్ నుంచి జన్నారం బస్సు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు

# రేషన్ షాపులో ప్లాస్టిక్ బియ్యం..?

## ఖంగు తిన్న లబ్ధిదారుడు

జనసముద్రం న్యూస్ కోహెడ జూలై 20:



రేషన్ బియ్యం లో ప్లాస్టిక్ బియ్యం పోలిన బియ్యం రావడంతో లబ్ధిదారుడు అవాక్కైపోయిన సంఘటన సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. కోహెడ గ్రామ పంచాయితీ అమ్లెట్ గ్రామమైన వెల్దండపల్లికి చెందిన మంద రమేష్ అనే లబ్ధిదారుడు గత నాలుగైదు రోజుల క్రితం కోహెడ మండల కేంద్రంలోని ఓ రేషన్ షాపు ద్వారా 18 కిలోల బియ్యాన్ని పొందాడు. అయితే శనివారం రోజున కోహెడలోని రఘురాం అనే పిండి గిర్ని లో సదరు బియ్యంలోని కొన్నింటిని పిండిగా పట్టించుకునేందుకుగాను వెళ్ళగా అందులో చాలా మట్టుకు ప్లాస్టిక్ బియ్యం గా కనిపించడంతో అటు లబ్ధిదారుడు ఇటు పిండి గిర్నిదారు అవాక్కయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సమీపంలోని వారందరూ వింతగా చూశారు. రేషన్ బియ్యం లో చాలా మటుకు తెల్లవిగా పెద్దవిగా కొరకడానికి వీలు లేకుండా ఉండడంతో వీటిని ప్లాస్టిక్ బియ్యమేనని చాలామంది అనుమానిస్తూ అవాక్కయ్యారు. అయితే రేషన్ బియ్యం లో ప్లాస్టిక్ బియ్యం తరహాలో బియ్యం రావడం ఒకవేళ అది అన్నం వండుకొని తింటే శరీరంలోకి వెళ్లి ఎలాంటి కీడు సంభవించేదోనని లబ్ధిదారుడు వాపోతున్నాడు. అయితే ఇంకా ఆ బియ్యాన్ని తాను వండుకోలేదని లబ్ధిదారుడు రమేష్ తెలిపారు. ఇప్పటికైనా రేషన్ షాపులో వచ్చే బియ్యం లో ప్లాస్టిక్ బియ్యం బియ్యం పోలి ఉన్న వి కలిసి ఉండటం పట్ల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మాలోతు తేజ మృతి కాంగ్రెస్ పార్టీ తీరని లోటు.



కామేపల్లి మండలం జనసముద్రం జులై 20:
మండలంలోని బర్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాలోతు తేజ (52) అనారోగ్య కారణం వలన మృతి చెందగా బర్లగూడెం వారి స్వగృహంలో తేజ పార్థివ దేహాన్ని సందర్శించిన టిపిసిసి రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి గారు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి ఈ సందర్భంగా వారి పార్థివ దేహం పై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి, పూలమాలవేసి నివాళు లర్పించారు, అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపాన్ని ప్రగాఢ సానుభూతి తెలిపి మొదటినుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ, పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేశారని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం, వారి కుటుంబానికి మరియు పార్టీకి తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ అండదండలు ఎప్పటికీ ఉంటాయని మనోధైర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ జడ్పిటిసి సభ్యులు మాలోతు సరిరామ్ నాయక్, ఎంపీటీసీ సభ్యులు మాలోతు శంకర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్లు బానోత్ బాబు నాయక్, జల్ల శ్రీను, నాయకులు మాలోతు మున్నానాయక్ భూక్య బాలు నాయక్, మాలోతు సర్వన్, బానోతు సంతు నాయక్, సొసైటీ డైరెక్టర్ జైత్రం ధారావత్ సంతు మాలోతు కృష్ణ, కిషన్ నాయక్, శశి బాబు, చిన్న నాయక్, మాలోతు ప్రేమ్ కుమార్, మాలోతు భావు సింగ్, లావుడియా వినోద్, వారి కుమారులు మాలోత్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

## చిన్న బీరవల్లి, రాపల్లి వెళ్లే వాగును పరిశీలించిన ఎస్సై మధుబాబు

బోనకల్, మధిర నియోజకవర్గం,
ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్, (జూలై 20):



ప్రస్తుతం కొనసాగుతున్న తుఫాన్ కారణంగా వరద ముంపుకు గురై ప్రాంతాలను గుర్తించే పనిలో మండల పోలీస్ అధికారులు నిమగ్నమై ఉన్నారు. ముందస్తు చర్యలో భాగంగా మండల పరిధిలోని చిన్న బీరవల్లి గ్రామం వద్ద వాగు ప్రవాహ పరిస్థితిని బోనకల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మధుబాబు పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల తో సమావేశమై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంపీఓ, ఆర్ఐ లు వాగును పరిశీలించారు. వర్షాల వలన వరద పోటు ఎక్కువ అవ్వటంతో చిన్న బీరవెల్లి నుండి రాపల్లి వెళ్లే రోడ్డు మధ్య నిలిచిపోయిన రాకపోకలు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి
జన సముద్రం న్యూస్ జూలై 20

జిల్లాలో రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని నీటి ప్రవాహముల దగ్గరగా ఉన్నపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని,లిజిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నెంబర్ 7995074803 ను ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్షాల వేళ ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో పిడుగుపాటుకు ఆవకాశం ఉంటుందని, కావున చెట్లు కింద,చెట్ల సమీపములో, టవర్స్ దగ్గర ఉండరాదన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ఎలక్ట్రికల్, వస్తువులు, మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని, విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram